నవతెలంగాణ
మెదక్
1
ఆదివారం | 27 అక్టోబర్ 2024 | www.navatelangana.com





దేశానికి... ఎర్రజెండా విధానాలే ప్రత్యామ్నాయం



- బీజేపీ, కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత
- ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో పోరాటాలు
- రాబోయే కాలంలో ఐక్య ఉద్యమాలు
- జనవరి 25-28 తేదీల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు
- ఆహ్వాన సంఘం చైర్మన్‌గా చుక్క రాములు
- 95 మందితో కమిటీ ఏర్పాటు
- సన్నాహక సమావేశంలో సీపీఐ(ఎం) నేతలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

దేశానికి ఎర్రజెండా విధానాలే ప్రత్యామ్నాయమని సీపీఐ(ఎం) నాయకులు స్పష్టం చేశారు. దేశంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో పోరాటాలు, ఐక్య ఉద్యమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు సంగారెడ్డి జిల్లాలో జరగనున్నందున శనివారం పీఎస్ఆర్ గార్డెన్‌లో గొల్లపల్లి జయరాజు అధ్యక్షతన ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై మాట్లాడారు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్ని పరిశీలిస్తే కమ్యూనిస్టులకు అనుకూల వాతావరణం ఉందన్నారు. చైనా సాధిస్తున్న పురోగతి ప్రపంచాన్ని ఆకర్షిస్తుందన్నారు. దేశంలోనూ బీజేపీ మతోన్మాద విధానాల వల్ల దేశం విచ్ఛిన్నం అయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి, సూత్రాలను కాలరాసి మనుధర్మాన్ని రాజ్యాంగంగా చేసి హిందూ రాజ్యాన్ని స్థాపించాలని బీజేపీ యోచిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్రజలకిచ్చిన హామీలేవీ అమలు కావడంలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఆరు గ్యారంటీలేవీ వంద శాతం పూర్తి కాలేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, రైతులకు రుణమాఫీ, భరోసా, మహిళలకు రూ.2500, పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగం, ఉపాధి వంటి హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మూసీ, హైడ్రా పేరిట అడావుడి చేస్తున్నారన్నారు. రాబోయే కాలంలో వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాల్ని కలుపుకుని ఐక్య పోరాటాలు, బలమైన ఉద్యమాలు నిర్వహించేందుకు మహాసభల్లో చర్చిస్తామన్నారు. సంగారెడ్డి సీపీఐ(ఎం) కమిటీ మహాసభల్ని విజయవంతంగా నిర్వహిస్తుందనే నమ్మకముందన్నారు. ఈ సందర్భంగా ఊరూరా ఇంటింటికీ ఎర్రజెండా సిద్ధాంతాలు, పోరాటాల్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

మహాసభల జయప్రదం కోసం కష్టపడదాం

చుక్క రాములు, ఆహ్వాన సంఘం చైర్మన్



సంగారెడ్డి పట్టణంలో తొలిసారిగి నిర్వహించనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు పిలుపు నిచ్చారు. పటాన్‌చెరు ఏరియా కమిటీ ప్రారంభమైన సీపీఐ(ఎం) ప్రస్థానం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 47 మండలాల్లో పార్టీ విస్తరించిందన్నారు. బలమైన కార్మిక, కర్షక, రైతాంగ పోరాటాలు నిర్వహించడం ద్వారా పార్టీ ప్రజల మద్దతు పొందగల్గుతుందన్నారు. రాష్ట్ర మహాసభలు నిర్వహించే అవకాశం వచ్చినందున శక్తివంచన లేకుండా అందరం కలిసి పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 1800 గ్రామాల్లో సీపీఐ(ఎం) విధానాలు, పోరాటాలు, ఎర్రజెండా గొప్పదనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. విస్తృతమైన ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలు ఎర్రజెండా మహాసభలకు ఆర్థికంగా హార్థికంగా సహకరించాలని కోరారు.

ఇంటింటికీ ఎర్రజెండా

జే.మల్లిఖార్జున్, సీపీఐఎం రాష్ట్ర నాయకులు



ఇంటింటికీ ఎర్రజెండాను తీసుకెళ్లి సీపీఐఎం అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ విధానాల గురించి వివరించే కార్యక్రమాన్ని తీసుకెళ్తాం. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఊరూరా వాడవాడన సీపీఐఎం రాష్ట్ర మహాసభల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాం. కార్మిక ప్రాంతాల్లో ఎర్రజెండా నిర్వహించిన పోరాటాల ఫలితంగానే మెరుగైన వేతన ఒప్పందాలు చేశాం. వేతన పోరాటాలే కాకుండా రాజకీయ పోరాటాల్లోనూ కార్మిక వర్గం ముందుండాల్సిన అవసరముంది. రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం ప్రతి కార్మికులు శక్తివంచన లేకుండా పనిచేయాలి. ఆర్థిక సహకారం అందిస్తునే ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాల్లోనూ కార్మిక వర్గం పాల్గొనాలి.

ఉత్సహా భరిత వాతారణంలో సన్నాహక సమావేశం

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహించే అవకాశం సంగారెడ్డి జిల్లాకు రావడంతో ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సన్నాహక సమావేశానికి తరలివచ్చారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన నాయకులు, పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఉత్సాహభరిత వాతావరణంలో ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు. ఆయా ఫ్యాక్టరీల్లో సీఐటీయూ అనుబంధంగా ఉన్న యూనియన్లు స్వచ్ఛందంగా పార్టీ మహాసభల కోసం విరాళాలు అందజేశారు. ఆహ్వాన సంఘం చైర్మన్‌గా చుక్క రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జే.మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి జయరాజు, కోశాధికారిగా బి.మల్లేశంతో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు 95 మందితో కమిటీ ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మెదక్ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం, మూడు జిల్లాల కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, కె.రాజయ్య, బి.రామచంద్రం, అతిమేల మాణిక్యం, ఎం.నర్సింహులు, గోపాల స్వామి, శిశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, బాస్కర్, నర్సమ్మ, మహేందర్‌రెడ్డి, కె.మల్లేశం, బవసరాజు పాల్గొన్నారు.

మహాసభల్ని దిగ్విజయంగా నడుపుదాం

గొల్లపల్లి జయరాజు, సీపీఐఎం జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి



సీపీఐఎం రాష్ట్ర మహాసభల్ని తొలిసారి నిర్వహించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. నాలుగు రోజుల పాటు జరిగే మహాసభలకు ఆహ్వాన సంఘం భారీ ఏర్పాట్లు చేయనుంది. 2025 జనవరి 25న నిర్వహించే భారీ బహిరంగ సభ, 26, 27, 28 తేదీల్లో జరిగే ప్రతినిధుల మహాసభలకు సీపీఐఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, బీవీ.రాఘవులుతో పాటు కేరళ ముఖ్యమంత్రి విజయన్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. రాష్ట్ర వ్యాప్తంగా మహాసభలలో పాల్గొనే వెయ్యి మంది ప్రతినిధులకు అవసరమైన ఏర్పాట్లను ఆహ్వాన సంఘం చేయనుంది. మహాసభల సందర్భంగా సీపీఐఎం చేస్తున్న పోరాటాలు, రాజకీయ విధానాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం కార్యక్రమాలు చేపడతాం. ఇంటింటికీ ఎర్రజెండా ఔనత్యాన్ని తెలిజయేసేం దుకు ఊరూరా ప్రచార జాతాలు పర్యటిస్తాయి.

విరివిగా విరాళాలు

సీపీఐఎం రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం సంగారెడ్డి జిల్లాలోని పలు పరిశ్రమలకు చెందిన సీఐటీయూ అనుబంధ యూనియన్లు భారీగా విరాళాలు అందజేశారు. మహాసభలు విజయవంతంగా జరిగేందుకు అవసరమైన ఆర్థిక సహాయంతో పాటు ప్రతి కార్మికుడూ మహాసభల ప్రచారం, ఏర్పాట్ల కార్యక్రమంలో పాల్గొంటామని ప్రకటించారు. శాండ్విక్ కంపెనీ యూనియన్ తరపున రూ.10 లక్షలు, టీఐడీసీ కంపెనీ యూనియన్ తరపున రూ.10 లక్షలు, క్రాన్‌బీర్ కంపెనీ యూనియన్ తరపున రూ.6 లక్షలు, సీబీఎల్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున రూ.3 లక్షల విరాళాల్ని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములుకు అందజేశారు. అదే విధంగా అమీన్‌పూర్ సీపీఐఎం శాఖ నుంచి రూ.5 వేల విరాళాలు అందజేశారు. విరాళాలు అందజేసిన వారిలో సీపీఐఎం నాయకులు బాగారెడ్డి, పాండురంగారెడ్డి, లలిత తదితరులున్నారు.

యూటీఎఫ్ వట్‌పల్లి మండలాధ్యక్షులుగా శివరాజ్



నవతెలంగాణ-వట్‌పల్లి

టీఎస్‌యూటీఎఫ్ వట్‌పల్లి మండల కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.శివరాజ్, ఉపాధ్యక్షులుగా లింగం, జనరల్ సెక్రెటరీగా ప్రభు, విమల, ట్రెజరర్‌గా నాగరాజు, సెక్రెటరీలుగా శ్రీనివాస్, సౌజన్య ఎన్నికయ్యారు.

నూజీవీడు పుష్కల్‌తో దిగుబడి పుష్కలం



నవతెలంగాణ-రాయపోల్

నూజీవీడు సీడ్స్ వారి పుష్కల్-9153తో వరిలో పుష్కలమైన దిగుబడి సాధించొచ్చని ఆ కంపెనీ రీజనల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, టెరటరీ మేనేజర్ ప్రవీణ్‌రెడి తెలిపారు. రాయపోల్ మండలంలోని అనాజీపూర్ గ్రామంలో ఓ రైతు సాగు చేసిన పుష్కల్- 9153 దొడ్డు రకం వరిసాగును రైతులతో కలిసి వారు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూజీవీడు సీడ్స్ గత 50 ఏండ్లకుపైగా రైతులకు నాణ్యమైన మరియు ఆధునిక పద్ధతుల్లో వంగడాలను అందిస్తున్నదన్నారు. తద్వార ఖర్చులు తగ్గి.. దిగుబడులు పెరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా వచ్చిన పుష్కల్-9153 రకం మంచి ఫలితాలను ఇస్తున్నదన్నారు. అగ్గి తెగులను సమర్థవంతంగా తట్టుకుంటున్నదన్నారు. ప్రతీ కంకిలో అధిక గింజలు ఉండడంతో దిగుబడు కూడా ఎక్కువగా వస్తుందన్నారు. వానాకాలం, రబీ రెండు పంటలకూ ఈ రకం అనువైనదన్నారు. కాబట్టి రైతులు ఇలాంటి విత్తనాలతో పంట సాగు చేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్ వల్లే అస్వస్థత



నవతెలంగాణ-జహీరాబాద్

ఫుడ్ పాయిజన్ వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు, గిరిజన సంఘం నాయకులు హీరూ రాథోడ్ ఆరోపించారు. అనారోగ్యం బారిన పడిన విద్యార్థులను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫుడ్ పాయిజన్ వల్లే 15 నుంచి 20 మంది విద్యార్థులు అనారో గ్యం బారిన పడ్డారన్నారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్‌లను కార్పొరేట్ స్కూల్‌కు ధీటుగా తీర్చిదిద్దాయని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటికీ విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల పరిస్థితి దినదిన గండంగా మారిందన్నారు. ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వం స్పందించే వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

30న సంగారెడ్డికి బీసీ కమిషన్ బృందం రాక

కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఈనెల 30న సంగారెడ్డికి వస్తున్నారని కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. మెదక్ ఉమ్మడి (సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట) జిల్లాలకు బంధించి ఈ నెల 30న సంగారెడ్డిలోని ఐసీసీ కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందన్నారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ కు నివేదించవచ్చని కలెక్టర్ సూచించారు.

16 కిలోల ఎండు గంజాయి పట్టివేత

పత్తిలో అంతర పంటగా సాగు చేసిన మరో 22 మొక్కల గుర్తింపు





నవతెలంగాణ-వట్‌పల్లి

16 కిలోల ఎండు గంజాయితో పాటు.. పత్తిలో అంతర పంటగా సాగుచేసిన 22 గంజాయి మొక్కలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన మన్నె విట్టల్ తన వ్యవసాయ భూమిలో పత్తి పంటలో గంజాయి సాగు చేస్తున్నాడనే నమ్మదగిన సమా చారంతో సంగారెడ్డి మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి ఆధ్వర్యంలో దాడులు జరిపారు. సాగు చేసి ఎండ బెట్టిన 16 కిలోల ఎండు గంజాయితో పాటు సాగులో ఉన్న 22 గంజాయి మొక్కలను గుర్తించారు. వాటిని చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీనారెడ్డి, జోగుపేట ఎక్సైజ్ సీఐ సాగర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ అనిల్, హెడ్‌కానిస్టేబుల్ విట్టల్, సిబ్బంది అనిల్, రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి, వీఆర్ఏ యాదయ్య, కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శనిగరం ప్రాజెక్ట్ సమీపంలో ఫిష్‌మార్కెట్ ఏర్పాటు చేస్తాం

ప్రాజెక్ట్‌లో చేపపిల్లలను విడుదల చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-కోహెడ

శనిగరం ప్రాజెక్ట్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని శనిగరం గ్రామ రిజర్వాయర్‌లో ఉచిత చేపపిల్లలను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో బలహీన వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందన్నారు. అలాగే మత్స్య కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు చేపపిల్లల పంపిణీని గతానికి మించి చేస్తున్నామన్నారు. గతంలో పేమెంట్ కొంతమేర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాటిని కూడ పూర్తి చేస్తామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కులవృత్తులు మారాలన్నారు. మత్స్యశాఖకు సంబంధించి మొబైల్ మార్కెట్‌లు చేపలను అమ్ముకోవడానికి మౌళిక వసతులు తదితర వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫిష్‌మార్కెట్ ఏర్పాటు చెసేందుకు ఆర్డీవో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని సూచించారు. హైద్రాబాద్, తదితర ప్రాంతాలకు వెళ్ళేవారు ఇక్కడే చేపలు కొనుగోలు చేసి పోయేలా అభివృద్ధి జరగాలన్నారు. అలాగే శనిగరం గెస్ట్‌హౌజ్‌ను, ఫిష్‌పాండ్‌ను పునరుద్ధరణ చేస్తామన్నారు. మత్స్య సంపద, పశుపోషణ, పాలు, కోళ్ళు పెంపకం వాటిపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్ ఫాం, డ్రాగన్ ఫ్రూట్, చేపల చెరువు, కోళ్ళ పెంపకం, ఆవులు, గేదెల పెంపకంపై రైతు వేదికల వద్ద అవగాహన కల్పిస్తూ బ్యాంకర్లతో మాట్లాడి లోన్‌లకు ఇబ్బంది కాకుండా చూస్తున్నామన్నారు. కాలువలతో ప్రతి గ్రామానికి నీళ్ళు అందిస్తామన్నారు. డబుల్‌రోడ్ పూర్తయిన చోట అవెన్యూ ప్లాంటేషన్‌తో రోడ్డుకు ఇరువైపుల చెట్లు నాటాలని అధికారులకు సూచించారు. త్వరలోనే టాంకాం ఉద్యోగాలు ఇచ్చే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, కాంగ్రెస్ జిల్లా ఇంఛార్జీ పూజల హరికృష్ణ, శంకర్ రాథోడ్, రాష్ట్ర మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్, ఫిషరీష్ అధికారులు, జిల్లా గ్రంథాల చైర్మన్ లింగమూర్తి, ఆర్డీవో, పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఆపి.. నిరుద్యోగులను మోసం చేయొద్దు

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మెన్ జి. చెన్నయ్య



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఆపి.. నిరుద్యోగులను మోసం చేయొద్దని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మెన్ జి.చెన్నయ్య రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బస్సు యాత్రలో భాగంగా 9వ రోజైన శనివారం సంగారెడ్డి చేరుకుంది. ఐబి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా బయలుదేరి టీఎన్జీవో భవన్లో బి.మల్లేశం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 24న హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాలలకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలను గ్రామాల్లో చర్చపెట్టి ప్రజలకు వివరించాలన్నారు. ఈ బస్సుయాత్రలో కో-చైర్మెన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు తల్లపల్లి రవి, చెరుకు రాంచందర్, గోపోజు రమేష్, మంత్రి నరసింహయ్య, మంచాల లింగ స్వామి, బేర బాలకిషన్, ఎ.చెన్న కేశవులు మేక వెంకన్న, గద్ద శ్రీను తాలుక అనిల్, యస్. నానులు మాట్లాడుతూ.. మాల మాదిగల సమస్యను బూచీగా చూపి మొత్తం ఉద్యోగ నోటిఫికేషన్లను ఆపి రాష్ట్రంలోని నిరుద్యోగుల ఆశలపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ నీళ్లు చల్లిందన్నారు. నోటిఫికేషన్లు ఆపినందుకు నిరుద్యోగ భృతిని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారతరాజ్యాంగంలో అంటరాని కులాలన్నింటినీ బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ ఒకచోట చేర్చి షెడ్యూల్డ్ కులాలుగా ఉండి ఐక్యంగా హక్కులు సాధించుకుంటూ కుల నిర్మూలన దిశగా పయనించాలని కోరుకుంటే.. మంద కృష్ణ మాదిగ మాత్రం మనువాదులతో కలిసి మనుధర్మ శాస్త్రం ప్రకారం మళ్ళీ మేము కులాలుగా విడిపోతామని పోరాటం చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణపై ఉన్న ఆసక్తి తొందర, మేనిఫెస్టోలో పెట్టిన దళిత డిక్లరేషన్, సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు పై ఎందుకు లేదని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కష్టపడ్డ మాలలకు యూనివర్శిటీ వీసీలతో పాటు మిగతా నామినేటెడ్ పోస్టులలో కూడా అన్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఏ.మల్లేశం, ఉపాధ్యక్షులు బి.అశోక్ కుమార్,డా. బి.జనార్ధన్, అనంతయ్య, విజయ్ రావు, బక్కన్న,రాజు, పుండరీకం, మొగిలయ్య, జె.గోపాల్, మోహన్ రాజ్, సుజాత, అనిత, దేవయ్య, మణియ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


శ్రద్ధగా చదువుకోవాలి



నవతెలంగాణ-గజ్వేల్

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని గజ్వేల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం ఎడ్యుకేషన్ హబ్ లో నిర్వహించిన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాలకు లోను కావద్దని సూచించారు. తల్లిదండ్రులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కళాశాలకు వచ్చిన విద్యార్థి సకాలంలో ఇంటికి చేరాలని అదేవిధంగా కళాశాలకు సమయానికి రావాలని తల్లిదండ్రులకు అధ్యాపకులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. మంచి విద్యా ఫలితాలు సాధించి గజ్వేల్ జూనియర్ కళాశాలకు పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు వెంకటరమణ, రాజిరెడ్డి, ప్రకాష్, హాస్టల్ వార్డెన్లు దేవిదాస్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పట్టణాలకే పరిమితం



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు మాట్లాడుకుంటూ మహిళా ఉచిత బస్సు ప్రయాణం కేవలం పట్టణాలకే పరిమితమైందని బీజే పీ గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు నాయిని సందీప్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు గజ్వేల్ ప్రాంతంలో హైదరాబాదు, గజ్వేల్, సంగారెడ్డి, చేర్యాల, సిద్దిపేట తదితర పట్టణాలకే పరిమితమైనట్లు అన్నారు. గ్రామాలకు బడి బస్సులు తప్ప మిగతా బస్సులు వెళ్లడం లేదని పేర్కొన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన అంతా గొప్పదనం ఎక్కడ కనిపించడం లేదన్నారు.

ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి



నవతెలంగాణ-మిరుదొడ్డి

మాదిగల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న సవతి తల్లి ప్రేమను విడనాడి, విద్య ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మిరుదొడ్డి మండల అధ్యక్షులు ఘటన శాంతి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం మాదిగ యువకులు, కుల పెద్దలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల వర్గీకరణ ఆవశ్యకతను వివరించి వర్గీకరణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరసనగా ఆవేదనను చూపాల్సిన బాధ్యత అందరికీ ఉందని తెలిపారు. వర్గీకరణ పోరులో ప్రతి మాదిగ ప్రజలు నిరుద్యోగులు విద్యార్థులు యువకులు ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభ ను మాదిగ ప్రజలు నిరుద్యోగులు, మాదిగ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ధర్మాసనం ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించి నిండు శాసనసభలో సమర్థిస్తూ విద్య ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని తెలిపారు. తక్షణమే విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా మహా దీక్షలు భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ మాదిగ, తరుణ్ మాదిగ ,రాజు మాదిగ రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
ఆదివారం | 27 అక్టోబర్ 2024 | www.navatelangana.com

చౌటకూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జిల్లా సహకార సంఘం శాఖ (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సూపర్వైజర్ వంశీకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస మద్దతు ధర క్వింటాలుకు ఏ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకం అయితే రూ.2,300, సన్న వడ్లకు కనీస మద్దతు ధర రూ.2,320తో పాటు సన్నాలకు రూ.500 బోనస్‌ను ప్రభుతం అందిస్తున్నదన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి దత్తు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు వర్కల రమేష్, సారా గోవర్ధన్, రామా గౌడ్,కృష్ణ, దప్పు శంకర్,కిరణ్,కైసర్,రాధా గౌడ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పార్టీ బీమా చెక్కు అందజేత



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సత్యనారాయణ యాదవ్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు పార్టీ సభ్యత్వం ఉన్నందున రూ.2లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి శనివారం రోజున బాధిత కుటుంబా నికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలకు అండగా ఉండడమే కాకుండా ఆపత్కాలంలో ఆదుకునే పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేవలం బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షులు దండు ప్రవీణ్‌రావు, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు మచ్చ దేవేందర్ రావు, గ్రామ కమిటీ అధ్యక్షులు మహేష్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ సురేష్‌గౌడ్, నాయకులు చంద్రశేఖరరావు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్కల్ కేజీబీవీ హాస్టల్, అక్కడి పరిసరాలను డిప్యూటీ డీఎంహెచ్ఓ మనోహర్ రెడ్డి స్థానిక వైద్యులతో కలిసి శనివారం పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులు ఒకేసారి అస్వస్థతకు గురవడంతో.. వెంటనే స్పందించిన వారు హాస్ట ల్‌లో తనిఖీలు చేశారు. హాస్టల్‌లోని గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. వైరల్ ఫీవర్ ఎలా ప్రబలుతుందో అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేయోద్దని.. తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. వారి వెంట సీహెచ్ఓ రవికుమార్, ఆస్పత్రి డాక్టర్ జైన్ అమృత్ రాజ్ , గోపి రాజ్ తదితరులున్నారు.



ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో తనిఖీ..

న్యాల్‌కల్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ మనోహర్ రెడ్డి తనిఖీ చేశారు. నిత్యం రోగుల సంఖ్య ఎంత ఉందో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందికి ముఖ్య సమావేశం నిర్వహించి.. గ్రామాల్లో వైరల్ ఫీవర్ పై తగు జాగ్రత్తలు సూచనలు ఇచ్చారు. ఆస్పత్రిలో గర్భిణీ స్త్రీల సంఖ్య పెంచాలన్నారు. ఈ సమావేశంలో సిహెచ్ఓ రవికుమార్, డాక్టర్ జైన్ అమృత్ రాజ్ , గోపిరాజ్, వైద్య ఆశ వర్కర్లు సిబ్బంది ఉన్నారు.



న్యాల్‌కల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

సీనియర్ న్యాయవాది బసంతపూర్ పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులు వారి తండ్రి హనుమంత్ రెడ్డి జ్ఞాపకార్థం న్యాల్‌కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులకు శనివారం ప్లేట్లు అందజేశారు. విద్యార్థుల కోసం ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమని హెచ్ఎం సచ్చిదానంద రెడ్డి అన్నారు. ఈ కార్యక్రంలో సీనియర్ న్యాయవాది పాండురంగారెడ్డి, హెచ్ఎం సచ్చితానంద రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ కుమార్, మొగులయ్య, సునీత విద్యార్థులు ఉన్నారు.



బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో కరణం జ్యోతికి సన్మానం

నవతెలంగాణ-సదాశివపేట

మహిళా బ్రాహ్మణ సంఘం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కరణం జ్యోతిని సదాశివపేట పట్టణంలోని సంగమేశ్వర మందిరంలో సదాశివపేట మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల కార్యదర్శి రాధిక జోషి, కోశాధికారి సుబ్బలక్ష్మి, బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రేజింతల్ ప్రాథమిక పాఠశాలలో నో బ్యాగ్ డే

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డేను నిర్వహించినట్టు హెచ్ఎం సఫియా సుల్తానా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, స్కిల్స్, పరిశుభ్రతపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం, విద్యాబోధన మెరుగుపడుతుందన్నారు.



అభివృద్ధికి సహకరిస్తాం..

నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి ప్రాథమిక కేంద్రం అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ అధ్యక్షులు డాక్టర్ సుంకు సురేందర్ రావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ బాల్ రెడ్డి అన్నారు. మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించి అక్కడ సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షులు రామ్ రెడ్డి రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సుధాకర్ రెడ్డి, మండల నాయకులు సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాండు ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన ఎస్పీ రూపేష్
- ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో వివిధ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు





నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి, డీజీపీ డా.జితేందర్ ఆదేశానుసారం పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రక్తదాన శిబిరం, ఓపెన్ హౌస్ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో జిల్లా ఎస్పీ స్వయంగా రక్త దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, సంగారెడ్డి జిల్లా, పట్టణ యువకులు స్వచ్ఛంధంగా అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 61 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని, మీరు చేసే ఈ రక్త దానం ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణా లను రక్షించడానికి ఉపయోగపడుతుందన్నారు. 'కులమత భేదం లేనిది, కృత్రిమంగా తయారు చేయలేనిది కాబట్టే రక్తా నికి వున్న విలువ చాలగొప్పది. అటువంటి రక్తాన్ని దానం చేసి రక్త ప్రధాతలుగా నిలవండి' అన్నారు. రక్తదానం చేసిన వారిలో సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఓపెన్ హౌస్..

పోలీస్ శాఖ పనితీరు, జిల్లా ప్రజల రక్షణలో పోలీసు శాఖ అవలంభిస్తున్న విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో.. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమానికి సుమారు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, జహీరాబాద్ డీఎస్పీ రామ్ మోహన్ రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎ.ఆర్ డీఎస్పీ నరేందర్, డా.జ్యోతి ఎస్.బి సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్‌బి ఎస్ఐ యాదవరెడ్డి, ఆర్ఐ.లు రామ రావ్, రాజశేఖర్ రెడ్డి, డానియల్, మరియు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకు రాజు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రథమ చికిత్స ఆసుపత్రులు సీజ్

నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స ఆసుపత్రులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మధుకర్ శనివారం సీజ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారం వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రథమ చికిత్స ఆసుపత్రుల్లో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లయితే వాటిని వెంటనే తొలగించుకోవాలని లేని యెడల తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయొద్దు



నవతెలంగాణ-జోగిపేట

వైద్య సేవలో నిర్లక్ష్యం చేయోద్దని జోగిపేట ఆర్డీవో పాండు సూచించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. వైద్యులు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించేలా పర్యవేక్షించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యకు సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సొంత నియోజకవర్గంలో ఎలాంటి లోటుపాటులు లేకుండా చూడాలన్నారు. పారిశుధ్యం విషయలో కూడా అలసత్వం వహించొద్దని, ప్రస్తుతం పారిశుధ్యం విషయంలో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా వార్డులో రోగులను వారికి అందుకున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను తనిఖీ చేసి, పరీక్షలు జాగ్రత్తగా చేయాలని సూచించారు. ఫార్మసీ గదిని పరిశీలించి ఫార్మసిస్టులతో మందుల విషయంలో మాట్లాడారు. ప్రతీ రోజు ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజన్ వ్యాధులు తగ్గుముఖం పట్టడంతో రోగుల సంఖ్య తగ్గిందని సూపరింటెం డెంట్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు.

సర్పంచ్ నుంచి మార్కెట్ చైర్మెన్ స్థాయికి..

- అంచెలంచలుగా ఎదిగిన మక్త జగన్మోహన్ రెడ్డి
- నేడు మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవం



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండలం నేరేడుగుంట గ్రామానికి చెందిన మక్త జగన్మోహన్ రెడ్డి.. సర్పంచ్ స్థాయి నుంచి జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ స్థాయికి అంచెలంచులుగా ఎదిగారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉండి.. పార్టీ అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారు. ఓపక్క ప్రజా సేవ.. మరోపక్క పార్టీ అభివృద్ధికి పాటుపడడంతో అటు ప్రజలతో పాటు.. పార్టీ అధిష్టానంలోనూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయనకు జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా అవకాశం దక్కింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ నేతృత్వంలో మార్కెట్ కమిటీ చైర్మెన్‌తో పాటు సభ్యులు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

మక్త జగన్మోహన్‌రెడ్డి కుటుంబం కాంగ్రెస్ పార్టీతో ఆది నుంచి సన్నిహితంగా ఉంది. కుటుం బ నేపథ్యం కూడా కాంగ్రెస్ పార్టీతో ఉండడంతో కాలేజీ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలలో కీలక వ్యక్తిగా తిరిగేవారు. ప్రస్తుత మంత్రి దామోదర్ తండ్రి దివంగత మాజీమంత్రి రాజనర్సింహతో జగన్మోహన్‌రెడ్డి కుటుంబం సన్నిహితంగా ఉండేది. కాంగ్రెస్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయన.. రాజకీయ ఆరంగ్రేటం చేసేందుకు సిద్ధమై ప్రజాక్షేత్రంలో 1988 సంవత్సరంలో మొట్ట మొదటిసారి కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నేరేడిగుంట సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఐదేళ్లపాటు సర్పంచ్ పదవిని సమర్థవంతంగా నిర్వర్తించి గ్రామంలో మంచి పేరు తెచ్చుకున్నారు. 1991-93 వరకు స్టోర్ డైరెక్టర్‌గా పని చేశారు. రెండోసారి 2000లో సర్పంచ్‌గా తిరిగి ఎన్నిక య్యారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో సన్నిహితంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. 2006-2009 వరకు సీడీసీ డైరెక్టర్‌గా ఆయన సేవలను అందించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దామోదర్ రాజనర్సింహ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. జగన్మోహన్ రెడ్డి సేవలను గుర్తించిన ఆయన జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా అవకాశం కల్పించారు.

పొలం బాట పట్టిన విద్యార్థినులు



నవతెలంగాణ-జహీరాబాద్

రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు పల్లె బాట పట్టారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారే కాక పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు వ్యవసాయ సాగు పద్ధతులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం ద్వారా విద్యార్థులు జహీరాబాద్‌లోని పలు గ్రామాల్లో బృందాలుగా పర్యటిస్తున్నారు. వారు తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేస్తూ శిక్షణ పొందుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకువచ్చేందుకు సహకారం అందిస్తామంటున్నారు. రైతులు దుక్కిలో విత్తనాలు విత్తిన నాటి నుంచి పంట దిగుబడి ఇంటికి చేరే దాకా పాటించాల్సిన ఆధునిక పద్ధతులను వివరిస్తున్నారు. గ్రామాల్లోనే ఉంటూ రైతుల కష్ట సుఖాలను తెలుసుకుంటున్నారు. రైతులు సాగు చేసే విధానం పరిశీలించడంతో పాటు వారికి అవగాహన కల్పిస్తున్నారు. దాంట్లో భాగంగా స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ రంజోల్ గ్రామంలో సీడ్ డ్రిల్ ద్వారా ఆలుగడ్డ విత్తు విధానం పైన, వెల్లుల్లి విత్తు విధానం పైన, అలాగే అరటి గెలల కోత విధానం పైన విద్యార్థులకు క్షేత్రస్థాయిలో శనివారం అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ప్రభుత్వ పాఠశాలలో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు నిరంతరం సహకారం అందించడం గొప్ప విషయమని నారాయణఖేడ్ నీరుడి మహేశ్వరి సహకారంతో రూ.20వేల కంప్యూటర్ సిస్టంను అదేవిధంగా సాఫ్ట్వేర్ పుప్పాల కిరణ్ సౌజన్యంతో రూ.20వేల విలువగల నాలుగు తరగతి ధ్వని సిస్టమ్స్‌ను శనివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పీజీహెచ్ఎం మన్మథ కిషోర్, చంద్రశేఖర్ ఆచార్య కృషి ఫలితంగా 800 మంది విద్యార్థులకు నాలుగు లక్షల విలువల బ్యాగులను సెవోద్గం ఫౌండేషన్ అందించడం తోపాటు ఎన్నారై సహకారంతో రూ.30 వేల సౌండ్ సిస్టంను, క్రీడా సామాగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సంజీవరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని దీనికి తోడు స్వచ్ఛంద సంస్థలు కూడా తమ సహకారాన్ని అందించాలన్నారు. రాబోవు రోజుల్లో దాతల సహకారంతో ఈ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి వచ్చినప్పుడే గురువులకు గౌరవం దక్కుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మన్మథ కిషోర్, సాఫ్ట్వేర్ పుప్పాల కిరణ్ , మహేశ్వరీ జగదీశ్, ఉపా ధ్యాయులు వెంకట్రావ్,చంద్రశేఖర్ ఆచార్య,రాజయ్య, రాజశేఖర్, సంగ్రామ్ జైపాల్ రెడ్డి, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలి



నవతెలంగాణ జిన్నారం

అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలని.. పంట పొలాల్లో పరిశ్రమల పేరిట అక్రమ నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకోబోమని అందూరు గ్రామ ప్రజలు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆందోళన చేపట్టారు. స్థానిక పంచాయతీ సెక్రెటరీ కంపెనీల పేరిట అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని.. ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామమైన అందూరులో 95 శాతానికి పైగా రైతు కుటుంబాలు ఉన్నాయన్నారు. పచ్చని పంట పొలాల మధ్య పరిశ్రమల ఏర్పాటు సరికాదని. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే అనుమతులు ఎలా ఇస్తారంటూ పంచాయతీ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అందూరు గ్రామస్తులు కురుపల్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్ స్పిరిట్ కంపెనీ కార్మికుల విజయం



నవతెలంగాణ-జోగిపేట

ఎమ్మెస్ స్పిరిట్ కంపెనీలో సమస్యల పరిష్కారానికి గత నాలుగు రోజులుగా కార్మికులు ధర్నా చేపట్టి.. విజయం సాధించారు. కంపెనీ యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు యూనియన్ జిల్లా కార్యదర్శి జి. సాయిలు, డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్, తదితర కంపెనీ యూనియన్ నాయకులతో శనివారం జరిపిన చర్చలు విజయవంత మయ్యాయి. లేబర్ కమిషనర్ కూడా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కంపెనీకి ఆదేశాలు జారీ చేయడంతో కార్మికులు శనివారం రాత్రి కంపెనీ ముందు విజయోత్సవాలు జరిపారు. ఈ సంర్భంగా యూనియన్ నాయకులకు స్వీట్లు తినిపించి ధన్యవాదాలు తెలిపారు.

డ్రయినేజీ పనులు పరిశీలించిన ప్రసాద్ రెడ్డి



నవతెలంగాణ-కోహిర్

మండల పరిధిలోని పిచేర్యాగడితాండాలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ సిస్టమ్ పనులను కాంగ్రెస్ నాయకుడు కె.ప్రసాద్ రెడ్డి తనసొంత నిధులతో ఇటీవలే నిర్మించిన విషయం విధితమే. కాగా పనులు ముగిసిన సందర్భంగా శనివారం ఉదయం రెండు తాండాలకు విచ్చేసి అన్ని గల్లీలు తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా తాండ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ పనులను చేసినందుకు ఆయనకు తాండావాసలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రాథోడ్ వినోద్ కుమార్ సోమ్లా నాయక్, తుకారం, అవినాష్,సంజీవ్ కుమార్,మరియు తాండ వాసులు యువకులు తదితరులు పాల్గొన్నారు

న్యాల్కల్ కస్తూర్బా పాఠశాల ఎస్ఓను సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

న్యాల్కల్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైన వెంటనే సెలవు పెట్టి ఆ పాఠశాల ఎస్ఓను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. అనారోగ్యానికి గురై సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాల్కల్ మండ లంలోని కస్తూర్బా పాఠశాల వసతి గృహ ల్లో ఎన్నో రోజులుగా అక్కడ విద్యార్థు లుకు ఫుడ్ పాయిజన్ అవుతున్నదన్నారు. అయినప్పటికీ ఏ ఒక్క అధికారి వెళ్లి పరిశీలించలే దన్నా రు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఫుడ్‌పాయిజన్ కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్ప టికైనా జిల్లా అధికారులు డీఈవో తక్షణమే కస్తూర్బా పాఠశాలను విజిట్ చేయాలని, అక్కడున్న హెల్త్ నర్స్ పైన నైట్ డ్యూటీ చేస్తున్న టీచర్ పైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ జిల్లా నాయకులు, రవి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాకు ఫిర్యాదు చేశానని తప్పుడు ఆరోపణలు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారంలో హైడ్రా పేరుతో మార్కింగ్ చేయబడిన పలు కాలనీల్లో తాను హైడ్రాకు ఫిర్యాదు చేశానని కాంగ్రెస్ నాయకులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొల్లారం మున్సిపాల్టీలోని కుంటల్లో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయాలని హైడ్రా ఆఫీస్‌లో తన పేరుతో లేఖను ఇచ్చినట్టు కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. తన సంతకం ఫోర్జరీ చేశారన్నారు. దీని పై తమ కౌన్సిలర్ల సమక్షంలో వారిపై పోలీసు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ విలేకర్ల కౌన్సిలర్‌లు బీరప్ప యాదవ్, శ్రీకాంత్ యాదవ్, ప్రభు, మాజీ ఎంపీటీసీ రత్నం, జనార్ధన్ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లు తొలగించండి

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని అందూరు గ్రామంలో బోగస్ ఓట్లను తొలగించాలని బీజేపీ సీనియర్ నాయకుడు అందూర్ కురుపల్ నరసింగరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోగస్ ఓట్ల విషయమై రెవెన్యూ అధికారులకు గతంలో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. స్థానికంగా నివాసం లేని వారికి కూడా ఓట్లు నమోదు అయ్యాయని అలాంటి వారి ఓట్లు తొలగించాలన్నారు. అలాగే గ్రామంలో గ్రామసభ లాంటివి చేపట్టకుండానే కంపెనీలు తదితర వాటి నిర్మాణాలు సాగుతున్నాయంటూ ఈ విషయమై సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా.. ఫలితం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

క్రిష్ణమూర్తి నివాసంలో పూజలో పాల్గొన్న శ్రీ మాధవనంద సరస్వతి

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేటలోని రాచకొండ క్రిష్ణమూర్తి నివాసంలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమంలో రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవనంద సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఓం శ్రీ మాత్రేయ నమః అనే జపాన్ని పఠిస్తూ 102 పూలతో స్వామి పాదుకలకు పూజ నిర్వహించారు. ఈ పూజలో భక్తులు డాక్టర్ అనంతరెడ్డి, పెండ్యాల రాములు, రవి, పత్తి వీరేశం, సుమన్,శ్రీధర్, సుబ్రహ్మణ్యం, ఆర్. ప్రభాకర్, భాగ్యమ్మ, మంజుల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుగా మారిన ప్రధాన రహదారి!!

నవతెలంగాణ-మెదక్ రూరల్



చిట్యాల గ్రామానికి, విద్యార్థులు, ప్రయాణికులు, నిత్యం వందలాదిమంది కూత వేటు దూరంలో ఉన్న మెదక్ పట్టణానికి తమ అవసరాల నిమిత్తం ప్రయాణం చేస్తుంటారు. మంభోజిపల్లి చిట్యాల మార్గమధ్యన తారు రోడ్డు గుంతలమయం అయింది. పక్కనే మద్యం దుకాణానికి నిత్యం వందలాది వాహనాలు రావడం జరుగుతుంది. ఈ గుంతలతో చిట్యాల ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది, టు వీలర్, త్రీ వీలర్ వాహనాలు దెబ్బ తింటున్నాయి. ఈ సందర్భంలో ఏదైనా ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉందని బాధితులు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్ రవాణా సంస్థ వాళ్లు రోడ్డుపైన గుంతలను పూడ్చి వేసేందుకు మరమ్మత్తులు చేయాలని వాహనదారులు, విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- ధర్మగ్రహ దీక్ష కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-కౌడిపల్లి



ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలంటూ టిపియూఎస్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాయిలపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ధర్మగ్రహ దీక్ష కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై నేటికి సంవత్సరం కాలమైనా ఉపాధ్యాయులకు అందవలసిన పెండింగ్ బిల్లులు, డిఎ, పిఆర్సిలను వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. టిపియుఎస్ ఆధ్వర్యంలో 28వ తేదీన తహశీల్దార్‌లకు వినతి పత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లీలాద్రి అంత్యక్రియలకు హాజరైన జిల్లా జడ్జి

నవతెలంగాణ-వెల్దుర్తి



మెదక్ జిల్లా కోర్టులో ప్రాసెస్ సర్వర్‌గా విధులు నిర్వహిస్తున్న క్రమంలో లీలాద్రి (60) అనారోగ్యానికి గురై గత కొంతకాలంగా చికిత్స పొందుతూ శుక్రవారం ఆరెగూడ గ్రామంలో మృతి చెందాడు. లీలాద్రి మరణ వార్త విన్న వెంటనే మెదక్ జిల్లా కోర్టు జడ్జి లక్ష్మీ శారద శనివారం ఆరెగూడెం గ్రామానికి చేరుకొని అంత్యక్రియలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మనిషి అన్న వాడికి చావు తప్పదని కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. వీరి వెంట కోర్టు సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.

వరి ధాన్యాలు దళారులకు విక్రయించకూడదు

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి
- పీఏసీఎస్ చైర్మెన్ లింగాల రాజలింగారెడ్డి

నవతెలంగాణ-మిరుదొడ్డి



రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకొని గిట్టుబాటు ధర పొందాలని మిడిదొడ్డి పీఏసీఎస్ చైర్మెన్ లింగాల రాజలింగారెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2300 మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని జాలపల్లి, గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామిడీ జీవన్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ నారోజు శ్రీనివాస్, కాంగ్రెస్ మద్దూరు, దూల్మిట్ట, మండల అధ్యక్షులు మేక మల్లేశం, కోల సాయిలు, మండల ఉపాధ్యక్షులు ముస్త్యాల మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి వూట్ల శ్రీధర్ రెడ్డి, దూల్మిట్ట మండల సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మి సాగర్, సీసీ నర్సాయ్య అభ్యుదయ గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు నాగులపల్లి పద్మ. వీవోఏ అనిత. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్‌కు మెహందీ ఆర్టిసు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



మెహందీ ఆర్టిస్టుగా పనిచేసిన ఓ మహిళ ఏకంగా అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌కు ఎం పికైంది. సిరిసిల్ల పట్టణానికి చెందిన నేహా ఎంతో కష్టపడి అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైంది. సిద్దిపేట పట్టణంలోని ఎక్స్ ట్రీమ్ జిమ్ లోనే శిక్షణ పొందిన నేహా ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 60 కేజీల విభాగంలో 122.5 కేజీల బరువును లిఫ్ట్ చేసి మొదటి స్థానంతో గోల్డ్ మెడల్ సాధించింది. అంతే కాకుండా అంతర్జాతీయ పోటీలకు సైతం ఎంపికైంది. అయితే గతంలో మెహంది ఆర్టిస్ట్‌గా పని చేసిన తనకు ఎక్స్ ట్రీమ్ జిమ్ వారి సహాయంతో అంతర్జాతీయ స్థాయి వరకు పవర్ లిఫ్టింగ్‌లో వెళ్లినట్లు నేహా తెలిపింది. తనకు ఎంతగానో సహాయం చేసిన ఎక్స్ ట్రీమ్ జిమ్ యాజమాన్యానికి, కోచ్ శేఖర్ నిఖిల్‌కు నేహా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

వడ్లను తక్కువ ధరతో దళారులకు అమ్ముకోవద్దు

నవతెలంగాణ-నంగునూరు



రైతులు తొందరపడి దళారులకు తక్కువ ధరతో వడ్లను అమ్ముకోవద్దని సొసైటి చైర్మెన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం పాలమాకుల సొసైటి ఆధ్వర్యంలో ఖానాపూర్, మైసంపల్లి, నర్మెట, తిమ్మాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320లు, కామన్ గ్రేడ్ ధాన్యానికి రూ.2300లు మద్దతు ధర అందజేయడం జరుగుతుందని తెలిపారు. సన్నాలకు అదనంగా రూ.500 లు బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం నిర్ణయించిన ప్రామాణికల మేరకు కొనుగోలు కేంద్రాల్లో రైతులు వడ్లను అమ్మి మద్దతు ధర పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల తహసీల్దార్ జి.సరిత, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, డైరెక్టర్లు, సొసైటి సిబ్బంది, హమాలీలు, రైతులు, నిర్వాహకులు,పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని కోటిలింగాల వద్ద గల 11 కేవీ ఫీడర్‌లో మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఏడీఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కోటిలింగాలు, మారుతి నగర్, శ్రీ సాయి నగర్, గాంధీనగర్, సుభాష్ నగర్, సంతోష్ నగర్, ఎన్జీవోస్ కాలనీ, ముదిరాజ్ గడ్డ, ఇందిరానగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోదారులు, పరిశ్రమల వారు సహకరించాలని కోరారు.

రైతులపై ప్రభుత్వానిది కపట ప్రేమ

- బీఆర్ఎస్ మండల నాయకుడు సతీశ్ ఆరోపణ

నవతెలంగాణ-బెజ్జంకి

రైతు భరోసాపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఊసెత్తకుండా కపట ప్రేమను వల్లిస్తోందని బీఆర్ఎస్ మండల నాయకుడు బండిపెల్లి సతీశ్ శనివారం ఆరోపించారు. ఆరు గ్యారంటీల అమలు పేరుతో అధికారంలోకి వచ్చి రైతు భరోసా, రూ.500 బోనస్ పూర్తి స్థాయిలో అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని ప్రభుత్వాన్ని సతీశ్ విమర్శించారు. ఇప్పటికైనా ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, రూ.500 బోనస్ అమలు చేసి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సతీశ్ డిమాండ్ చేశారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నాయకులు గరుగుల సుధాకర్, కోమ్మట అమర్, కొమ్మట ఎల్లం పంజా కుమార్ తదితరులు మాజీ జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ అధ్యక్షులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఎంపీ రఘునందన్ రావు వారికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు బీజేపీ సిద్ధాంతాలు నచ్చి బీజేపీలో చేరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సిద్ధరాంరెడ్డి, బూత్ అధ్యక్షులు జాల పోచయ్య, బాబు సీనియర్ నాయకులు చలిమేటి నరేందర్, అబ్దుల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పారపెట్టిన ధాన్యంకు మంచి ధర

- కేంద్రాలకు తరలించాలి

నవతెలంగాణ-టేక్మాల్



తూర్పారపెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోకి తరలిస్తే మంచి ధర వస్తుందని తహశీల్దార్ తులసీరామ్ అన్నారు. శనివారం గొల్లగూడెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసిల్దార్ తులసిరామ్, ఎంపిడివో విఠల్, ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని సాలోజీ పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిడివో విఠల్ ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తామని, సన్న ధాన్యంకు ప్రభుత్వం ప్రకటించిన రూ.500 ల బోనస్ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపియం రామకృష్ణ, ఎఈవో మంజుల, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప, నాయకులు శ్రీధర్ చారి, పాపయ్య, చింతా రవి, షేక్ మహజర్, సాగర్, కిషోర్, సమేల్,దుర్గష్, నరేందర్, ఇర్షద్ ఐకేపీ సిసి దుర్గయ్య ,ఐకేపీ సెంటర్ నిర్వాహకులు ఆంజనేయులు విసిరినా, యాదగిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించిన పోలీసులు

- ఆయుధాల పనితీరును విద్యార్థులకు వివరించిన ఎస్సై
- ప్రభుత్వ ఉద్యోగం సాధించే లక్ష్యంతో చదవాలి
- తూప్రాన్ ఎస్ఐ శివానందం

నవతెలంగాణ-తూప్రాన్




తూప్రాన్ పోలీస్ స్టేషన్లో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని కళాశాల పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తూప్రాన్ ఎస్సై శివానందం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించామన్నారు. ఏకే 47 గన్,రైఫిల్, పిస్టల్, డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్, వాకి టాకీ, రిసెప్షన్లో అందుకునే పిటిషన్ల పై వివరణ, లాకప్ గదులు పోలీస్ స్టేషన్ రికార్డుల గది,సైబర్ క్రైమ్, క్రైమ్ చేసిన నేరస్తులను పట్టుకునే విధానాన్ని, షీ టీమ్స్‌పై అవగాహన, డ్రగ్స్,ధూమపానం, మద్యపానం, మత్తు పదార్థాలు, దొంగతనాలు అత్యాచారాలు హత్యలు చేసే వారిని పట్టుకుని విధానాన్ని విద్యార్థులకు వివరించామన్నారు. రాష్ట్ర అంతర్ రాష్ట్ర దొంగలను ఏ విధంగా ట్రేస్ చేసి పట్టుకునే వివరాలను విద్యార్థులకు తెలిపారు. భవిష్యత్తులో మంచిగా చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే లక్ష్యంతో ముందుకెళ్లాలని, మంచి కలలు కనండి కలలను నిజం చేసుకోండి అని పాఠశాల, కళాశాల విద్యార్థులకు సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులు కనుక విద్యార్థులందరూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లో పరిష్కారం అయ్యే ప్రతి కేసుకు సంబంధించిన విషయాలపై పూర్తి అవగాహన విద్యార్థులకు కల్పించారు. ఈ సందర్భంలో విద్యార్థులు పోలీసులకు పలు ప్రశ్నలను అడుగుతూ వివరాలను సేకరించారు. విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన కల్పించాలని ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. సమాజంలో జరిగే అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నేటి విద్యార్థులు యువత కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ హెడ్ కానిస్టేబుళ్లు పోలీసులు, పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హల్దీ వాగు నీరు చౌర్యానికి ప్రయత్నిస్తున్న దుండగులు

- హల్దీవాగు ప్రాంతంలో నష్టపోనున్న 200 మంది రైతులు
- పైప్‌లైన్ ద్వారా నీటి చోరీకి ప్రయత్నిస్తున్న వ్యక్తి నుంచి ప్రాణ భయం
- ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాలలో కిష్టాపూర్ గ్రామస్తుల ఫిర్యాదు

నవతెలంగాణ-తూప్రాన్





తూప్రాన్ మండలంలోని కిష్టాపూర్ గ్రామస్తులు హల్దీ వాగు నుంచి నీటి చోరీకి ప్రయత్నిస్తున్న వ్యక్తులపై తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డికి, డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హల్దీ వాగు తూప్రాన్ తల మాణిక్యమైన గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద నుండి కిష్టాపూర్ రోడ్డు మార్గంలో వెళ్లే రహదారి ప్రక్కన ఉన్న యావపూర్ గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్ 385,383,382,386,387 లలో గల పిపి ల్యాండ్, ఇతర సర్వే నంబర్లు గల భూమి సుమారుగా 85 నుంచి 90 ఎకరాల వరకు ఉన్నది. మల్లారెడ్డి అనే వ్యక్తి ఖరీదు లీజు తీసుకొని, అట్టి భూమిలోకి 40 హెచ్పి పైప్లైన్ ద్వారా కొంతమంది అండదండలతో దర్జాగా నీటినీ తీసుకెళ్తున్నారు. మల్లారెడ్డి అనే వ్యక్తి హల్దీ వాగు నుంచి అక్రమంగా నీటి తరలింపుతో సుమారుగా హల్ది వాగు ప్రక్కన ఉన్న 200 మంది రైతులు నష్టపోనున్నారు. నీటి చోరీని అడ్డుకుంటున్న కిష్టాపూర్ గ్రామస్తులను మల్లారెడ్డి అనే వ్యక్తి బెదిరిస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తూ, ఇది కేసీఆర్‌గారి కన్నారావు భూమికి సంబంధించిన వారిదని గ్రామస్తులను హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై తూప్రాన్, కిష్టాపూర్ గ్రామ రైతులు తమకు న్యాయం చేయాలని, తమను బెదిరిస్తున్న, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

వడ్లను కొనుగోలు చేయని కేంద్రాలు

- వెంటనే వడ్ల కొనుగోలు చేపట్టాలి

నవతెలంగాణ-నిజాంపేట



వడ్ల కొనుగోలు కేంద్రాలను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించి దాదాపు వారం రోజులు అవుతున్నప్పటికీ నేటికీ వడ్ల కొనుగోలు కేంద్రాలలో వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో చేతిలో చిల్లి గవ్వ కూడా లేదని అందుకే ప్రైవేట్ వ్యాపారస్తులకు వడ్లను అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ.2320 ధర ప్రకటించడం జరిగిందని ప్రైవేట్ వ్యాపారస్తులు మాత్రం రెండు వేలకు క్వింటాల్ చొప్పున కొనుగోలు చేస్తున్నారని, క్వింటాలుకు రైతులు దాదాపు రూ.300ల వరకు నష్టపోతున్నారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్లను రోడ్లపై ఎండబెడుతున్నప్పుడు ఎండుతున్నవి వర్షాలకు తడిసి ముద్దవుతున్నాయని, అందుకే రైతులు వెంటనే దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎక్కడ చూసినా వడ్లను రోడ్లపై ఆరబెట్టి ఉన్నాయని వడ్లను కొనుగోలు ఎప్పుడు చేస్తారని ఎదురుచూస్తున్నారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు నిర్వాహకులను వివరణ కోరగా ప్రభుత్వం రైస్ మిల్లులను అలాట్ చేయలేదని ఏఏ రైస్ మిల్లులను కొనుగోలు కేంద్రాలకు అలాట్ చేసినప్పుడే వడ్లు రైతుల నుంచి కొనుగోలు చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వము వెంటనే వడ్లను కొనుగోలు చేసే విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు.

మానవత్వం చాటుకున్న కౌన్సిలర్ రాజు సేటు

- పారిశుద్ధ కార్మికురాలికి సొంత డబ్బుతో ఇల్లు నిర్మాణానికి భూమి పూజ
- మరో దళిత మహిళ ఇంటికి మరమ్మతులు

నవతెలంగాణ-రామాయంపేట





పెద్ద పెద్ద వ్యాపారాలు చేసి, పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించేవారుంటారు. కాలంతో పోటీపడి డబ్బులు సంపాదించి పెద్ద ఎత్తున ఆస్తులు పోగేసుకునే వారు ఉంటారు. కానీ ఆ సంపాదనలో నుంచి పొరుగు వారికి సేవ చేసేవారు అరుదుగా కనిపిస్తుంటారు. తాను కార్పొరేట్ స్థాయి వ్యాపారి కాకపోయినా, రామాయంపేట పరిసర ప్రాంతాలలో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ, తనకున్న దాంట్లో నుంచి ఇతరులకు సేవ చేసి ఆనందపడే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి రామాయంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు. అందరూ ప్రేమగా పిలిచే పేరు రాజు సేటు. రామాయంపేట మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలుగా కోతి అనిత అనే మహిళ పనిచేస్తుంది. ఆమె భర్త కొద్ది కాలం క్రితం మృతిచెందగా, ఆమెకు సొంత ఇల్లు లేని విషయం తెలుసుకున్న ఆయన, తన సొంత డబ్బుతో ఇల్లు నిర్మాణానికి సిద్ధమయ్యాడు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆమెకు నూతన ఇల్లు నిర్మించి ఇవ్వడానికి శుక్రవారం భూమి పూజ చేశారు. అలాగే పట్టణానికి చెందిన మరో మహిళ చిప్పకుర్తి శంకరమ్మ ఇంటికి మరమ్మతు కోసం పనులు ప్రారంభించారు. గజవాడ నాగరాజు చేస్తున్న సేవలకు స్థానికులు ఆయనను అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రామాయపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ భాదే చంద్రం, మాజీ ఏఎంసీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, కౌన్సిలర్ అనిల్, కోఆప్షన్ సభ్యురాలు పాతూరి ప్రభావతి, బీఆర్ఎస్ నాయకులు చింతల యాదగిరి, సరాఫ్ శ్యాం, చిలుక ఎల్లయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటే

- భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి చంద్రాగౌడ్

నవతెలంగాణ- తొగుట



పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటేనని ఇదే మా సంఘం యొక్క నినాదమని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి చంద్రాగౌడ్ అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర(భారతీయ కిసాన్ సంఘ్)కార్యవర్గం కమిటీ ఆధ్వర్యంలో జిల్లా లోని 26 మండలాల కార్యవర్గ కమిటీల సభ్యులు సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగాపూర్ గ్రామానికి చెందిన చేపూరి చంద్రాగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా కార్యదర్శి గా ఎన్నుకునేందుకు సహకరించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సంఘం ఏ రాజకీయ పార్టీలకు సంబంధించినది కాదన్నారు. ఇది కేవలం రైతులకు సేవ చేసే సంఘమని, జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామ కమిటీల ఎంపిక పూర్తి చేసినట్లు చెప్పారు. కొన్ని గ్రామ కమిటీలు పూర్తి కాలేదని త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. వ్యవసాయానికి సంబంధించిన ధాన్యం కొనుగోలు, కరెంటు సమస్యలు, ఇతర సమస్యలు ఏవి వున్న రైతుల తరఫున ముందు వరుసలో ఉండి సమస్య లు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

విజ్ఞాన శాస్త్రం మానవ జీవితంతో ముడి

నవ తెలంగాణ-మెదక్ టౌన్



విజ్ఞాన శాస్త్రం మానవ జీవితంతో ముడిపడి ఉందని పట్టణ సిఐ నాగరాజు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని సిద్ధార్థ ఆదర్శ జూనియర్ కళాశాల యందు డ్రగ్స్-సైన్సు-మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పట్టణ సిఐ నాగరాజు, ఉప్పులేటి నరేష్‌లు హాజరై మాట్లాడారు. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని, దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మచ్చేంద్రనాథ్, పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

కార్యశాల బ్రోచర్ల ఆవిష్కరణ



నవ తెలంగాణ-మెదక్ టౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలం గాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షి యల్ కాలేజ్ గణిత శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రియల్ అనాలసిస్ అను అంశంపైన ఒక రోజు కార్యశాలను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను గణిత శాస్త్ర శాఖాధిపతి పి వెంకటేశ్వర్లు అధ్యాపకుల సమక్షంలో విడుదల చేశారు. ఈ కార్యశాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ గోవర్ధన్, అసోసియేట్ ప్రొఫెసర్ వి.కిరణ్ రిసోర్స్ పర్సన్లుగా పాల్గొననున్నారు. ముఖ్య అతిథిగా మెదక్ పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేందర్ పాల్గొననున్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

నవ తెలంగాణ-మెదక్ టౌన్



మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన జానకి రామ్ సాగర్ బదిలీపై శనివారం జిహెచ్ఎంసికి వెళ్లారు. నూతన కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి నియామకమయ్యారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామానికి చెందిన బొమ్మ శివమల్లు (45) శనివారం చేపల వేటకు వెళ్లి మృతి చెందాడని అతని భార్య బొమ్మ ఐలవ్వ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే శివమల్లు అప్పుడప్పుడు చేపల వేటకు వెళుతూ ఉంటాడనీ అదే మాదిరిగా శుక్రవారం నాలుగు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి తన గ్రామ శివారులోని హైదర్ చెరువు వద్దకు చేపల వేటకు వెళుతున్నానని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య అతని బంధువులు చెరువులో వెతకగా, శనివారం ఉదయం 7:30 నిమిషాలకు శివమల్లు చనిపోయి కనిపించాడు. తన భర్త చెరువులో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి చనిపోయినాడని దరఖాస్తు మృతుడి భార్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని నిజాంపేట పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఎంపీడీఓ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని పాలమాకుల కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ బి.లక్ష్మప్ప శనివారం సందర్శించారు. కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం మహిపాల్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన లింగని జైపాల్ (38) శుక్రవారం మృతిచెందాడు. శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు మొర్సు లక్ష్మా రెడ్డి, సాయిరెడ్డి జితేందర్ రెడ్డి, మొర్సు శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి, తదితరులున్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన ఉపాధి శిక్షణ



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్‌లో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం బి.ఏ, బీ.కాం. బీఎస్సీ, బీఎస్సీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్ విద్యార్థులకు వివిధ ఉపాధి అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు ముగించినట్లు ప్రిన్సిపాల్ కమల క్రిస్టియన్ తెలిపారు. శనివారం ఆమె సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 21 నుంచి శనివారం వరకు టీఎస్ కేసీకి మహేంద్ర ప్రైడ్ పై అవగాహన కల్పించినట్లు అన్నారు. విద్యార్థినిలకు ఇంటర్వ్యూ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్, లాజికల్ థింకింగ్, గ్రూపు డిస్కర్షన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్‌ల మీద అవగాహన కల్పించినట్లు చెప్పారు. స్కిల్స్ నేర్చుకోవడం వల్ల ఉన్నత విద్య అవకాశాలని, అదేవిధంగా ఇంటర్వ్యూలలో నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీలత మంచి శిక్షణ తరగతులను నిర్వహించి వారిలో విద్యాపరమైన విషయాలను వెలికి తీసి ప్రయత్నం చేసినట్లు చెప్పారు.అనంతరం టీఎస్‌కేసి కోఆర్డినేటర్ డాక్టర్. జె. ఉమా రాణి, శిక్షణ శిబిరాన్ని ఉద్దేశించి మట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్ కేసీ మెంటర్ సిహెచ్ సందీప్, అధ్యాపకులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



- ఎంఈఓ రంగనాయక్
- వైద్యాధికారి తులసి

నవతెలంగాణ-అక్కన్నపేట: మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అక్కన్నపేట మండల విద్యాధికారి రంగనాయక్, వైద్యాధికారి తులసి అన్నారు. శనివారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో గ్రామ హైస్కూల్లో పొగాకు వంటి మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చాలామంది విద్యార్థి దశ నుంచే బీడీ, సిగరెట్, గంజాయి, డ్రగ్స్, గుట్కా, పాన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని అన్నారు. దీనివల్ల చిన్న వయసులోనే నోటి క్యాన్సర్ వంటి వాటి బారిన పడి మరణిస్తున్నారని తెలియజేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని తెలిపారు. కాబట్టి యువత చదువుపై దృష్టి పెట్టి మంచి ఉద్యోగ అవకాశాలు సంపాదించుకోవాలని తెలియజేశారు. దేశ భవిష్యత్తును కాపాడేది యువత అని, అలాంటి వీరు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ వెంకటలక్ష్మి హెచ్‌ఎం శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య, ఏఎన్‌ఎం వనజ,

చౌటకుంట తండాపై జెండా ఎవరిదో.?

- కొత్త గ్రామపంచాయతీలో పోటీకి ఉత్సాహం
- బరిలో ఉంటామంటున్న యువత
- తండా ప్రజల మనసు గెలిచేదెవరో.?

నవతెలంగాణ-అక్కన్నపేట


రాష్ట్రంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎలక్షన్స్ ముగిశాయి. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు పర్యాయాలు పాలించిన బీఆర్ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకుంది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది. ఇదే తరుణంలో స్థానిక సంస్థల ఎలక్షన్స్ త్వరలో జరగబోతున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటినుంచే గ్రామాల్లో, మండలాల్లో నాయకులంతా ప్రజల మన్ననలు పొందేందుకు ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే తరుణంలో ఈసారి కొన్ని కొత్త గ్రామపంచాయతీలు కూడా ఏర్పడ్డాయి. ఈ గ్రామాల్లో అత్యధికంగా యువత సర్పంచ్ బరిలో నిలిచేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. అలాంటి గ్రామాల్లో చౌట కుంట తండా గ్రామపం చాయతీ కూడా ఒకటి. మరి ఈ తండాలో ఎవరు పోటీ చేయబోతున్నారు. చౌటకుండా తండాపై జెండా ఎగరేసింది ఎవరు.. వివరాలు ఏంటో చూద్దాం.?

తండాపై జెండా నాదే.?

అక్కన్నపేట మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలో చౌటకుంట తండా కూడా ఒకటి. దీని పరిధిలో సీతారాం తండా కలుపుకొని మొత్తం 495 మంది జనాభా ఉన్నారు. ఇందులో పురుషులు 261, స్త్రీలు 234. ఇంతకుముందు ఈ తండా కుందన్వానిపల్లి గ్రామ పరిధిలో ఉండేది. తాజాగా కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. ఇక్కడి నుంచి సర్పంచ్‌గా వివిధ పార్టీల నుంచి పోటీ చేసేందుకు యూత్ నాయకులు ఉత్సాహం చూపిస్తున్నారు. కొంతమంది పార్టీల నుంచి కాకుండా ఇండిపెండెంట్‌గా కూడా బరిలో ఉంటాం అంటున్నారు.

పోటీలో మేముంటాం..?


చౌటకుంట గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య విపరీతమైన పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది. అంతేకాకుండా ఇండిపెండెంట్‌లుగా కూడా కొంతమంది నాయకులు వారి బలాన్ని చూపించుకోవాలనుకుంటున్నారు. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన నాయకులు గుగులోతు రాజు నాయక్, మాలోతు గణేష్, భూక్యరాజు, మాలోతు రమేష్ ఉన్నారు. ఇందులో కాంగ్రెస్, ఇండిపెండెంట్లు, బీఆర్ఎస్ నుంచి కూడా కొంతమంది బరిలో ఉండనున్నట్టు తెలుస్తోంది. ఇందులో పోటీ చేసే వారంతా యూత్ కావడంతో తండాలో పోటి రసవత్తరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. మరి ఈ పోరులో తండా ప్రజలు ఎవరిని ఆదరిస్తారో కొన్ని నెలల్లో తెలుస్తుంది.



హైవే పనులను త్వరగా పూర్తి చేయాలి

- మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత


నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



నేషనల్ హైవే పనులను ప్రజలకు ఇబ్బంది కలగకుండా తొందరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత అన్నారు. శనివారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నేషనల్ హైవే పనులు చేసే అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. నేషనల్ హైవేకి సంబంధించిన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, లైటింగ్ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని వెంటనే పూర్తి చేయాలన్నారు. 15 రోజుల నుంచి స్ట్రీట్ లైటింగ్ లేక పట్టణ ప్రజలందరూ, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. వెంటనే పనుల్లో బేగంపేట్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, నేషనల్ హైవే ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


అంబేద్కర్ కెనరా విద్యాజ్యోతి చెక్కులు అందజేత

నవతెలంగాణ-మర్కుక్



కెనరా బ్యాంక్ డా.బీఆర్. అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్షిప్ పథకం ద్వారా కెనరా బ్యాంక్ గజ్వేల్ అధ్వర్యంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల చేబర్తిలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, మెరిటోరియస్ 5 మంది బాలికలకు స్కాలర్షిప్ చెక్కులను శనివారం పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీల నుంచి స్కాలర్షిప్ సాయం 5 నుంచి 7వ, తరగతి వరకు విద్యార్థికి రూ.3 వేలు, 8 నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు విశ్వేశ్వర, రాజయ్య, నర్సింహారావు , రమాకాంత్ రావు, గౌతమి, రవీందర్ రావు, విద్యార్థులు, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



- ఎమ్మెల్సీ యాదవరెడ్డి

నవతెలంగాణ-కొండపాక

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలం లోని మేదిని పూర్, మాత్ పల్లి బొబ్బాయి పల్లి, తిప్పారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. శుద్ధి చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం మగ్దుమ్ అలీ నాయకులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ కబడ్డీ పోటీలు


నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల వద్ద స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సిద్దిపేట ఆధ్వర్యంలో 29న అండర్ 14, 17 బాల బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించబడునని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్యలు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ క్రీడాకారులు తప్పకుండా బోనఫైడ్‌తో హాజరు కావాలని తెలిపారు. ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయవలెనని సూచించారు. 28న ఉదయం 10 గంటలకు డ్రా తీయబడునని, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిలు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఓటుకు డిగ్రీ

- గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్ రెడ్డి


నవతెలంగాణ-సిద్దిపేట



గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేయడానికి డిగ్రీ పూర్తి అయిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్ రెడ్డి అన్నారు. సిద్దిపేటలో డిగ్రీ పూర్తి అయిన వారిని కలుస్తూ ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు విధివిధానాలపై శనివారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీ కోసం పోటీలో ఉంటున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి అయిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని, కోర్టు సమీపంలో సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచితంగా అక్కడ ఆన్లైన్ లో దరఖాస్తు చేయడం జరుగుతుందని, ఈ సేవ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

కష్టపడ్డ కార్యకర్తలు పక్కకు


నవతెలంగాణ-గజ్వేల్



గత పదేండ్లుగా కాంగ్రెస్ కోసం గజ్వేల్ పట్టణంలో కష్టపడ్డ కార్యకర్తలను పక్కకు పెట్టి కొత్తవారిని చేర్చుకుంటున్నారని కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధిష్ఠానం దీనిపై దృష్టి పెట్టాలని పార్టీ కోసం కష్టపడ్డ వారికి అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన చెందారు. అధిష్ఠానం పార్టీ కార్యకర్తలను స్థానికంగా గుర్తించాలని ఆయన కోరారు. గజ్వేల్ పట్టణంలో కొత్తవారిని కాంగ్రెస్ లోకి తీసుకొని పాతవారిని పట్టించుకోవడంలేదని ఆయన తెలిపారు. రాబోయే కాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని వాటిపై ప్రభావం చూపుతుందని ఆయన చెప్పారు. జిల్లా మంత్రులు ఈ విషయంలో దృష్టి పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒక గజ్వేల్ పట్టణంలో కాకుండా నియోజకవర్గం లో ఇదే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. తామంతా అసంతృప్తిగా ఉన్నామని అధిష్ఠానం గుర్తించాలని ఆయన చెప్పారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


నవతెలంగాణ -దుబ్బాక



టీ తాగడానికని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుబ్బాక ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు మున్సిపల్ కేంద్రంలోని 13 వ వార్డుకు చెందిన బెల్లె భూమయ్య (50) ఈనెల 17న ఉదయం టీ తాగడానికి బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఈనెల 26న భార్య నర్సవ్వ దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుని కుటుంబానికి అండగా బీఆర్ఎస్

నవతెలంగాణ-మిరుదొడ్డి



గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన పిట్ల కిష్టయ్య కుటుంబాన్ని మీరుదొడ్డి బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తోట అంజిరెడ్డి మాట్లాడుతూ ఆయన మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మృతిని కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కాస కిష్టయ్య, చార్వక కుమార్, గొల్ల రాములు, సిరినేని వెంకటయ్య, లచ్చగౌడ్, భూమయ్యతో పాటు కులస్తులు ఉన్నారు.

నేడు పోలీస్ స్టేషన్ ఆవరణలో రక్తదానం శిబిరం


నవతెలంగాణ-చేర్యాల

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చేర్యాల సర్కిల్ పోలీస్ శాఖ, వివేకానంద టీచర్స్ అసోసియేషన్ సహకారంతో చేర్యాల పోలీస్ స్టేషన్ ఆవరణలో నేడు(ఆదివారం) మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రక్తదానం చేయాలనుకునే రక్తదాతలు ముందుకు రావలసిందిగా కోరారు.

ఉద్యాన ఆయిల్ పామ్ సాగు విస్తరణ పై అవగాహన

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్





జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపై శనివారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్ ఫెడ్ మండల స్థాయి అధికారుల శిక్షణ, సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు రైతుల గుర్తింపు, మొక్కలు నాటడం, ఎరువుల యాజమాన్యం, వ్యాధి తెగుళ్ల నివారణ, అంతర్ పంట సాగు, పంటకోత పద్ధతులపై అధికారులకు దిశానిర్దేశనం చేశారు. రైతులకు ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వం ద్వారా వారికి కల్పిస్తున్న సబ్సిడీ, డీఆర్డీఓ ద్వారా అందించే ప్రోత్సాహం గురించి సంపూర్ణ సమాచారాన్ని మొదటగా అధికారులు అవగతం చేసుకోవాలని, అనంతరం రైతు సాగు సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి దిశగా కృషి చేయాలన్నారు. ఇకపై ప్రతి నెల మండలంలోని వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్ ఫెడ్ సిబ్బంది సమిష్టిగా షెడ్యూల్‌ను రూపొందించుకొని దాని ప్రకారం రైతుల వద్దకు వెళ్లడం, ఆయిల్ పామ్ సాగుకు వారిని ప్రోత్సహించడం, రైతువేదికల్లో అవగాహన సదస్సులను నిర్వహించడం వంటి కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు. సాగులో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను రికార్డులలో నమోదు చేసుకొని పై అధికారులకు పంపించాలని ఆదేశించారు. జిల్లాలో సంబంధిత అధికారులు సమన్వయంతో మండలాల్లో పర్యటించాలని, జిల్లాలోని ప్రతి నియోజక వర్గం వారీగా జిల్లా స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎవరైన నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించినట్లయితె వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో చివరగా ప్రతి మండలం వారిగా టార్గెట్, అచ్చీవ్ మెంట్, సాధించాల్సిన ప్రగతికి కావాల్సిన సమయం తదితర విషయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త సుబ్బారావు, వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్ ఫెడ్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్




తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా సమావేశం మాచపురం రాజనర్సు అధ్యక్షతన సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరగగా ఈ సందర్భంగా కాముని గోపాల స్వామి హాజరై మాట్లాడారు రాష్ట్ర వ్యాప్తంగా 12,750 గ్రామపంచాయతీలో సుమారుగా 50 వేల మంది గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు పనిచేస్తున్నారు. గ్రామంలో మంచినీటి సరఫరా, వీధిలైట్లు, హరితహారం, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలు, డ్రైవర్స్ ఆఫీస్ వర్క్ నిర్వహణ, తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారన్నారు. ఏండ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న నేటికీ ఉద్యోగ భద్రత లేదని, పనికి సరిపడా తగిన వేతనం ఎలాంటి గుర్తింపు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలి చాలని వేతనాలతో పూట గడవడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు అప్పుల పాలై అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు జీఓ 51 తీసుకుని వచ్చి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. నేటి ఈ ప్రభుత్వం 10నెలలు గడుస్తున్నప్పటికీ పంచాయతీ కార్మి కుల సమస్యలు పరిష్కరం కాలేదని ఎన్నికల్లో కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని నవంబ ర్ నెల 5,6 తేదీల్లో హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర 48 గంటల దీక్ష నిర్వహిస్తున్నామని ఇట్టి దీక్షకు సిద్దిపేట జిల్లాలో ఉన్నటువంటి ప్రతి గ్రామపంచాయతీ కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పనులు బంద్ చేసి సమ్మెకు సిద్ధమవుదామని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పెండింగ్లో ఉన్నటువంటి వేతనాలను వెంటనే చెల్లించాలని జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని రూ.20 లక్షల ఇన్సూరెన్స్ వెంటనే చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి తునికి మహేష్, జిల్లా నాయకులు కనకయ్య, బాలరాజు, కళవ్వ పాల్గొన్నారు.

ఎర్రజెండా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో

నవతెలంగాణ-చేర్యాల




ఎర్రజెండా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, పట్టుదల అంకితభావంతో ప్రజలు సీపీఐ(ఎం) నిర్వహించే పోరాటాల్లో కలిసి రావాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెద్దరాజుపేట గ్రామంలో శనివారం గ్రామ శాఖ పార్టీ మహాసభ జోగేల్లి బాల నర్సయ్య అధ్యక్షతన జరిగింది. మహాసభలో వెంకట మావో పాల్గొని మాట్లాడుతూ నేడు ప్రభుత్వాలు మారినప్పటికి ప్రజల సమస్యలు పరిష్కారం కాకుండా ఉంటున్నాయని, ఏండ్ల తరబడి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నప్పటికీ సమస్యలు పెరగడం తప్ప తగ్గడం లేవన్నారు. ప్రజలు సంఘటితమై పార్టీ నిర్వహించే పోరాటాల్లో పాల్గొని ప్రజా సమస్యలను సాధించుకోవాలని కోరారు. నేడు గ్రామంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు, అనేక కుటుంబాలకు రేషన్ కార్డులు లేక అర్హులైన వారందరికీ పెన్షన్లు రాక, చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు లేక దిక్కు తెలియని పరిస్థితుల్లో భవిష్యత్తు ఏమిటని అయోమయ పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. అధికార పార్టీ అనేక హామీలను ఇచ్చి ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు.పెద్ద రాజుపేట గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, ఈ గ్రామం నుంచి పోతిరెడ్డి పల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, ప్రజల పక్షాన పోరాడేది సీపీఐ(ఎం) ఎర్రజెండేనని అన్నారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా గర్నపెల్లి నర్సింహులు, సోషల్ మీడియా ఇంచార్జిగా పాపి శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో పార్టీ మండల కమిటీ సభ్యులు మోకు దేవేందర్ రెడ్డి, గొర్రె శ్రీనివాస్, మామిడాల గౌరయ్య నూనె మల్లయ్య ఆగం రెడ్డి, గర్నపల్లి శంకరయ్య, యాదగిరి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన సుడా పరిధి

- నాలుగు మున్సిపాలిటీలు, 286 గ్రామాల విలీనం
- ప్రభుత్వం విడుదల చేసిన జీవో

నవతెలంగాణ-సిద్దిపేట



సుడా (సిద్దిపేట అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ)ని విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేయడంతో, సుడా పరిధిలోకి కొత్తగా నాలుగు మున్సిపాలిటీలు, 286 గ్రామాలు సుడాలో విలీనమయ్యాయి. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం సుడాను ఏర్పాటు చేసి దాన్ని పరిధిలోకి సిద్దిపేటతో పాటు 26 గ్రామాలను తీసుకువచ్చింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా అంతటికి విస్తరిస్తూ నిర్ణయం తీసుకుంది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మర్కుక్, ములుగు, వర్గల్ మండలాలను మినహాయించి 22 మండ లాల్లో ఉన్న 286 గ్రామాలను సుడా పరిధిలో చేర్చారు.

అభివృద్ధి కోసమే విస్తరణ


మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్- అర్బన్ డెవ లప్మెంట్ జారీ చేసిన జీవోలో పట్టణాల చుట్టూ ఉన్న గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో సమగ్రంగా, ప్రణాళికతో అభివృద్ధి చేసేందుకు సుడాను విస్తరిస్తున్నట్లు జీవోలో పేర్కొంది.

4 మున్సిపాలిటీలు, 286 గ్రామాలు

గతంలో సుడా పరిధిలో సిద్దిపేటతో పాటు 26 గ్రామాలు ఉండగా, నూతన జీవోతో దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, చేర్యాల, మున్సిపాలిటీలు కలిసాయి. అంతేకాకుండా అక్కన్నపేట మండలంలోని 14 గ్రామాలు, కోహెడ మండలంలోని 16 గ్రామాలు, కొమరవెల్లి మండలంలోని 9 గ్రామాలు, నంగునూరు మండలంలోని 19 గ్రామాలు, రాయపోల్ మండలంలోని 13 గ్రామాలు, బెజ్జంకి మండలంలోని 14 గ్రామాలు, తొగుట మండలంలోని 16 గ్రామాలు, చేర్యాల మండలంలోని 13 గ్రామాలు, చిన్నకోడూరు మండలంలోని 16 గ్రామాలు, దౌల్తాబాద్ మండలంలోని 17 గ్రామాలు, గజ్వేల్ మండలంలోని 21 గ్రామాలు, హుస్నాబాద్ మండలంలోని 10 గ్రామాలు, సిద్దిపేటరూరల్ మండ లంలోని 7 గ్రామాలు, నారాయణ రావుపేట మండలంలోని 4 గ్రామాలు, దుబ్బాక మండలం లోని 14 గ్రామాలు, అక్బర్ పేట-భూంపల్లి మండలంలోని 13 గ్రామాలు, మీరుదొడ్డి మండలంలోని 9 గ్రామాలు, దుల్మిట మండలంలోని 8 గ్రామాలు, మద్దూర్ మండలం లోని 11 గ్రామాలు, జగదేవ్పూర్ మండలంలోని 18 గ్రామాలు, కుకునూరు పల్లి మండలంలోని 15 గ్రామాలు, కొండపాక మండలంలోని 9 గ్రామాలు సూడా పరిధిలోకి వచ్చాయి.

సిద్దిపేట మున్సిపల్‌ని సందర్శించిన కౌన్సిలర్లు

నవతెలంగాణ-సిద్దిపేట




సిద్దిపేట పట్టణ సందర్శనలో భాగంగా చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేయు విధానంను 12 పురపాలక సంఘాల కమిషనర్‌లు, అధికారులు శనివారం పరిశీలించారు. బుస్సాపూర్‌లోని రిసోర్స్ పార్క్‌లోని బయోగ్యాస్, బయోమైనింగ్, ఇన్సినరెటర్ నిర్వహణను పరిశీలించారు. హౌసింగ్ బోర్డ్ వద్ద ఉన్న ఐటీసీ వావ్ ఈ శ్రీ ఫౌండేషన్ పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. వివిధ అంశాలను మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ ఇతర కమిషనర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల ఖర్చు పై సమీక్ష

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య

నవతెలంగాణ-గజ్వేల్



దళిత, గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధుల ఖర్చుతో పాటు సంక్షేమ పథకాల అమలు పై త్వరలో సమీక్ష నిర్వహించి అభివృద్ధి ఫలాలు ఎస్సీ, ఎస్టీలకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య హామీ ఇచ్చినట్లు డీబీఎఫ్ బృందం తెలిపింది. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధుల పై కమిషన్ సమీక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్వర్యంలో డీబీఎఫ్ బృందం కమిషన్ చైర్మెన్‌ను శనివారం కలిసినట్లు డీబీఎఫ్ బృందం తెలిపింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.అర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు అణగారిన వర్గాలకు అందేవిధంగా కమిషన్ ప్రయత్నం చేస్తుందని వారు చెప్పారు. వివక్ష, అంటరానితనం, అత్యాచారాల ను నిరోధించడంతో పాటు విద్య, ఉపాధి, భూమి సమస్యల పరిష్కారానికి కృషి చెస్తున్నామన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులకు 41 సీఆర్పిని వర్తింప చెయవద్దని త్వరలో కేంద్ర సామాజిక మంత్రితో పాటు, జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్‌లను ఎస్సీ, ఎస్టీ సంఘాల బృందంతో కలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో ప్రొఫెసర్ తడ్క యాదగిరి, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

- డీపీఎం రాజయ్య, ఏపీఎం దాకయ్య

నవతెలంగాణ-మిరుదొడ్డి



రైతుల సంక్షేమని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని డీపీఎం రాజయ్య, ఏపీఎం డాకయ్య అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఐకేపీ వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు సీసీలు, వివోఏలు కొనుగోలు కమిటీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఏవైనా ఇబ్బందులు కలిపితే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధ్యాన్యం విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ బాలరాజు, ప్రభాకర్, దాస్, వైకుంఠం, సిద్ధయ్య, మన్నెమ్మ, శ్రీనివాస్, శారదా వీవోఏలు మహేష్ నసీరుద్దీన్, వెంకటలక్ష్మి, వినోద సిద్ధిరాములు తో పాటు పలువురు పాల్గొన్నారు.

సీఎంఆర్ బియ్యం అందించని రైస్ మిల్లుకు నోటీసులు

- రూ.1.70 కోట్ల బియ్యం బకాయి

నవతెలంగాణ-దుబ్బాక

గతేడాది వర్షాకాలానికి సంబంధించి ప్రభుత్వానికి బకాయిపడ్డ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యాన్ని సకాలంలో అందించని సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట వార్డులోని మహేశ్వర రైస్ మిల్లుకు నోటీసులు అందజేయడం జరిగిందని జిల్లా పౌరసరఫరాల శాఖ (డీఎస్ఓ) అధికారిని తనూజ శనివారం తెలిపారు. జిల్లాకు 3 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం కేటాయించగా దాదాపు 99 శాతం వరకు రికవరీ అయ్యాయని, లచ్చపేటలోని మహేశ్వర రైస్ మిల్లు నుంచి ప్రభుత్వానికి రావాల్సిన రూ.1.70 కోట్ల విలువైన 17 ఎస్.కే (4,930 క్వింటాళ్ళ) ల బియ్యం నేటికీ అందజేయలేదని గుర్తు చేశారు. ఆ రైస్ మిల్లు పార్ట్నర్లలో ఇద్దరు మరణించడం వలన ఆలస్యమైనట్లు తెలిసిందనారు. బకాయి ఉన్న బియ్యాన్ని ఈ నెల 30లోగా అప్పగించాలని ఆ రైస్ మిల్లుకు చెందిన పది మంది పార్ట్నర్‌లకు నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. గడువులోగా సీఎంఆర్ బియ్యం అందించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు.

ఈ నెల 28న సిద్దిపేటలో ఎమ్మార్పీఎస్ సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

ఈ నెల 28న సిద్దిపేటలోని వయోలా గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరయ్యే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా సంయుక్త కార్యదర్శి ఆరెపల్లి కనకయ్య మాదిగ పిలుపునిచ్చారు. శనివారం నంగునూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశం జయప్రదం చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ సాయంత్రం నాలుగు గంటలకు హాజరవుతారని చెప్పారు. రాష్ట్రంలో వర్గీకరణ చేయాలని, అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఉద్యోగుల చేపడతానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ జరగకుండానే ఉద్యోగుల భర్తీ చేపడుతున్నాడని ఆరోపించారు. చేపట్టడాన్ని నిరసిస్తూ ఉమ్మడి మెదక్ జిల్లా సిద్దిపేటకు వస్తున్న సందర్భంగా జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

తొగుట సర్కిల్ పరిధిలో వీక్లీ పరేడ్

నవతెలంగాణ-తొగుట



సర్కిల్ పరిధిలో వీక్లీ పరేడ్ నిర్వహించామని ఎస్ఐ రవికాంత్ రావు తెలిపారు. శనివారం ఉదయం సిద్దిపేట కమిషనర్ ఆదేశానుసారం తొగుట సర్కిల్ హెడ్ క్వార్టర్ తొగుట సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో వీక్లీ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొగుట, దౌల్తా బాద్, సర్కిల్ పరిధిలో గల 5 పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని 28 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లిని విమర్శించే హక్కు లేదు

- మాజీ ఎమ్మెల్యే రసమయికి రాసూరి హెచ్చరిక

నవతెలంగాణ-బెజ్జంకి




గత పది ఎండ్లు మానకొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసి అవినీతి అక్రమాలకు పాల్పడి నీతిమా లిన రాజకీయ వ్యవస్థను పెంచి పోషించారని మాజీ ఎమ్మె ల్యే రసమయికి ఎమ్మెల్యే కవ్వంపల్లిని విమర్శించే హక్కు లేదని శనివారం కాంగ్రెస్ నాయకుడు రాసూరి మల్లికార్జు న్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమించు కొని పలు అక్రమాలకు మాజీ ఎమ్మెల్యే రసమయి ఆజ్యాం పోశారని ఎమ్మెల్యే కవ్వంపల్లిపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని మల్లికార్జున్ సూచించారు.

రేపు ధర్మ యుద్ధ సన్నాహక సభ

- మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లాధ్యక్షుడు పర్శరాములు మాదిగ
- ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరు

నవతెలంగాణ-బెజ్జంకి



జిల్లా కేంద్రంలో రేపు ధర్మ యుద్ధ సన్నాహక సభ నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హజరవుతున్నారని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లాధ్యక్షుడు పెర్కా పర్శరాములు మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వద్ద మండల ఇంచార్జీ మాతంగి జితేందర్ అధ్వర్యంలో ధర్మ యుద్ధ సన్నాహక సభ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పర్శరాములు మాదిగ హాజరై మాట్లాడారు.ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై ధర్మ యుద్ధ సన్నాహక సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతకింది పర్శరాములు, జిల్లా నాయకులు మాదాసు బాబు, మండలాధ్యక్షులు జనగాం శంకర్, బెజ్జంకి పట్టణాధ్యక్షులు లింగాల బాబు, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు తాడిచెట్టు భూమయ్య పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

- హుస్నాబాద్ ఏసీపీ పాసాల సతీష్



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ పాసాల సతీష్ అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన సైకిల్ ర్యాలీని హుస్నాబాద్ ఏసీపీ వి.సతీష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ప్రజలకు తెలియజే యాలని ఉద్దేశంతో సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. పోలీసు అమరవీరులను అనునిత్యం స్మరించుకుంటూ ప్రజలలో పోలీసుల సత్సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, బెజ్జంకి ఎస్ఐ అభిలాష్, అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్, ఏఎస్ఐ మల్లేశం, డిస్టిక్ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, పీఈటీ టీచర్లు ఐలయ్య, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ మూడో మహాసభలు గజ్వేల్‌లోనే

నవతెలంగాణ-గజ్వేల్



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిద్దిపేట జిల్లా కమిటీ మూడో మహాసభలు గజ్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్నట్టు సీపీఐ(ఎం)పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య తెలిపారు. సీపీఐ(ఎం) మహాసభల ఏర్పాట్ల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో నిర్వహించే సమావేశాలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి , జిల్లాలో ఉన్న నాయకత్వం సమావేశంలో పాల్గొంటుందని అన్నారు. గతంలో రెండు మహాసభలు జరిగాయని ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బీజేపీ మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత సభలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలో రాష్ట్రంలో జిల్లాలో జరుగుతున్న పరిణామాలను కార్మికులు రైతాంగం ఉద్యోగులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు జిల్లా మహాసభలో చర్చించడం జరుగుతుందని అన్నారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కోతకొచ్చిన వరి పంటకు తీవ్ర నష్టం



- రైతు పోలు నరసయ్య ఆవేదన

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ మండలం తోటపల్లి ఊర చెరువు కింద కొందరు రైతుల వల్ల తన వరిపంటకు తీవ్ర నష్టం జరుగుతున్నట్లు రైతు పోలు నరసయ్య తెలిపాడు. చెరువు కట్ట కింది నుంచి వచ్చే జాలు నీరు దిగువకు వెళ్లకుండా పక్కనే ఉన్న రైతు అడ్డుకట్ట వేస్తున్నాడన్నారు. దీనితో ఆ నీరంతా తన పొలంలోనే నిల్వ ఉండి వరి పంట మురిగిపోతోందన్నారు. ఇదేమిటని అడిగిన, పెద్దమనుషులు చెప్పిన వినడం లేదన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హుస్నాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పంచాయతీ సెక్రటరీల జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా విజయ్ కుమార్, కోశాధికారిగా రామ్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎండి. ఫహీం, ఉపాధ్యక్షులుగా రాములు, రాజు, శ్రీకాంత్, రాజమణి, జాయింట్ సెక్రటరీలుగా గణేష్, మహేష్, శోభ, అరుణశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నరసింహులు, ఏటి బాబు, సతీష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా రవి, ప్రసాద్, మాధవ్, చక్రపాణి, రజిత ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఎండి జహీరుద్దీన్, దేశరాజు శ్రీనివాస్ రావు, మాజీ అధ్యక్షులు విష్ణు వ్యవహరించారు.

ఐఐఎల్ ట్రాక్టర్ బ్రాండ్‌పై అవగాహన సదస్సు

నవతెలంగాణ-గజ్వేల్



ఐఐఎల్ కంపెనీ ట్రాక్టర్ బ్రాండ్ పై అవగాహన సదస్సు రైతులకు శనివారం గజ్వేల్ మండలం అమ్మదీపూర్ గ్రామంలో నిర్వహించారు. గత రెండు దశాబ్దాలకు పైగా రైతులకు న్యాయతక నమ్మకమైన పురుగుమందులను రైతులకు అందిస్తుందని అవగాహన సదస్సులు సెల్స్ ఆఫీసర్ శ్రీకాంత్ తెలిపారు. మార్కెట్లోకి టోరీ సూపర్ అని నూతన కలుపు మందును విడుదల చేశామని తెలిపారు. మొక్కజొన్న పంటలు వచ్చే అన్ని రకాల కలుపు మొక్కలను నాశనం చేయడానికి తీసుకొచ్చామన్నారు. మందులు మోతాదులో వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సెల్స్ సిబ్బంది శంకర్, కర్ణాకర్, ఎల్లం, ప్రశాంత్, రైతులు కర్ణాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, జైపాల్, బాల్ లింగం తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడకు ఎంపికైన విద్యార్థి

నవతెలంగాణ-గజ్వేల్



రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ ఫుట్బాల్ క్రీడలకు గజ్వేల్ క్రీడాకారుడు సుశాంత్ ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా ఫుట్బాల్ సెక్రెటరీ సమ్మయ్య, గజ్వేల్ ఫుట్బాల్ అధ్యక్షులు గంగిశెట్టి రవీందర్ శనివారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 19 ఎస్జిఎఫ్ఐ ఫుట్బాల్ టీంకు సెంట్ పీటర్స్ స్కూల్ 10వ తరగతి సుశాంత్ వచ్చేనెల సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుట్బాల్ ఉపాధ్యక్షులు గంగాల నరేష్, కోచ్ నాగేష్, సభ్యులు నాయిని శ్రీనివాస్, శేఖర్, మహేష్ గౌడ్, మహేష్, సతీష్, నర్సింలు, తౌటి శ్రీనివాస్, హనుమంత రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు విద్యార్థి సుశాంత్‌ను అభినందించారు.

రిజర్వేషన్లపై సూచనలు, సలహాలకు సమావేశం

నవతెలంగాణ-గజ్వేల్



రిజర్వేషన్ల పై అవగాహన, అభ్యర్థన, సలహాల కోసం ఈ నెల 30న సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల కమిషన్ సమావేశం నిర్వహిస్తుందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు స్థానిక సంస్థల వారిగా కల్పించవలసిన అవసరమైన రిజర్వేషన్లు దామాషను పేర్కొన్న విషయంలో వివిధ పార్టీల నాయకులు తమ అభిప్రాయాలను వినతులను చేసుకోవచ్చని ఆయన చెప్పారు. అంతేకాకుండా లిఖితపూర్వకంగా కూడా అందజేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాన్ని వెల్లడించుకోవాలని ఆయన కోరారు.

పోగొట్టుకున్న ఫోన్ బాధితుడికి అప్పగింత

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని నకిరెకొమ్ముల గ్రామానికి చెందిన బోయిని రత్నాకర్ ఇటీవల వన్‌ప్లస్ ఫోన్‌ను పోగొట్టుకోవడంతో ఎంక్వైరీ చేసి శనివారం ఎస్సై అభిలాష్ తిరిగి బాధితుడికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రత్నాకర్ ఈ నెల 12వ తేదిన కోహెడ నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఫోన్ పడిపోగా సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో వెతికి పట్టుకొని బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కానిస్టేబుల్ బాబు, ఉన్నారు.

ఫీజుల కొరకు తహసీల్దార్‌కు వినతిపత్రం

నవతెలంగాణ-కొమురవెల్లి



విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలనీ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్ శనివారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు విద్యార్థులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా భారత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్లు పెండింగ్లో ఉన్నాయనీ, గత ఆరు ఏండ్లుగా నిధులు విడుదల కాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు తాడూరి విక్రమ్, మండల నాయకులు సమీర్, రాఘవ, చందు, కైలాష్ సన్నీ, పాల్గొన్నారు.

పొట్టేల్ మూవీ నటులను సన్మానించిన చైర్మెన్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



పొట్టేల్ సినిమాలో నటించిన హుస్నాబాద్ ప్రాంతం కళాకారులను మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత సన్మానించారు. ఈ సందర్భంగా సినిమా పరిశ్రమలో మనవాళ్లు ఎదగడం ఎంతో అభినందనీయమన్నారు. పొట్టేలు మూవీలో సామాజిక చైతన్యం కలిగిన సందేశం ఉందని, ప్రజలందరూ ఈ సినిమాను తప్పకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గౌడ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వెంకటేశ్వర స్వామి సేవలో గజ్వేల్ వాసులు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ వాసులు తిరుమల తిరుపతి దేవస్థానం సేవలో పాల్గొంటూ గత వారం రోజుల నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుమల తిరుపతి ఆలయ ప్రాంగణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం గజ్వేల్ వాసులు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం పవిత్ర ప్రసాదం లడ్డు సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రముఖ వ్యాపారస్తులు సంతోష్, శ్రీనివాస్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలని కలియుగ వైకుంఠ వాసుడు శ్రీ వెంకటేశ్వర స్వామి సేవలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం అని శ్రీ వెంకటేశ్వర స్వామి కరుణాకటాక్షాలతో అందరూ బాగుండాలి స్వామివారిని వేడుకోవడం జరిగిందని అన్నారు.ఇ

బంతిపూల సాగు.. లాభాలు బాగు



నవతెలంగాణ-గజ్వేల్

బంతిపూల సాగు లాభాల వైపు సాగుతుందని రైతులు చెపుతున్నారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో చేతికొస్తున్న బంతిపూల పంట సాగు రైతుకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుంది. కోతుల భయానికి గజ్వేల్, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో బంతిపూల తోటలను రైతులు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తే కోతులు పూర్తిగా నాశనం చేస్తున్నాయి. దీంతో బంతిపూల తోటల వైపు మళ్లినట్లు రైతులు చెప్పున్నారు. సిద్దిపేట జిల్లాలో పదివేల ఎకరాలపైగా బంతిపూల పంటను రైతులు సాగు చేశారు. ఇందులో కొన్ని చోట్ల దసరా బతుకమ్మ పండగ ముందు చేతికి రాగా దీపావళి నాటికి పూర్తిగా పంట చేతికి వస్తుందని రైతులు అంటున్నారు. గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల తదితర ప్రాంతాల్లో బంతిపూల పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఒక ఎకరాకు సుమారు రూ.50 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. అధిక దిగుబడి రాబడి బంతిపూల తోటలతో వస్తుందని వారు చెప్పున్నారు. ఇంకా ఎకరానికి15 నుంచి 25 ప్యాకెట్ల విత్తనాలు పడతాయని ఒక్కొక్క పాకెట్‌కు రూ.2 వేలు ఉంటుందని రైతులు చెప్పారు. ఇలాగా ఒక ఎకరాకు వివిధ రకాల మందుల ఖర్చులు రూ.10 వేల వరకు ఖర్చు వస్తుందని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా పూల తోటను ఏరేందుకు కూలీలకు కూడా రూ.15 వేల ఖర్చు వస్తుందని చెప్పారు. ఎకరం పూల తోటలో మంచి దిగుబడి వస్తే రైతుకు లాబడే అవుతుందన్నారు. ఒక కేజీ రూ.70 నుంచి రూ.100 వరకు ధర పలుకుతే రైతుకు పెట్టుబడి వస్తున్నది. ఆ లోపు ధర పలికితే నష్టం వస్తుందని చెప్పున్నారు. ఒక్కొక్కసారి కిలో బంతిపూల ధరలు రూ.150 నుంచి రూ.200 ధర పలికితే రైతుకు మంచి లాభ ఉంటుందని రైతులు అంటున్నారు. పెట్టుబడి రూ.50 వేల వెళ్లిపోగా లాభం మరో రూ.50 వేల వరకు ఉంటుందని రైతులు అంటున్నారు. ప్రతి సంవత్సరం బంతిపూల తోటలను పెంచుతున్నామని రైతులు చెప్పారు.

మార్కెట్లో ధర పలుకుతుంది.



మార్కెట్లో పూల తోటలకు మంచి ధరనే ఉంది. ప్రతి ఏడాది పూల తోటను సాగు చేస్తున్నాను. దసరా దీపావళి పండుగలకు గజ్వేల్ ప్రాంతమే కాకుండా హైదరాబాద్ ప్రాంతానికి తీసుకపోతున్నారు. కిలోల చొప్పున లెక్కలు కట్టి విక్రయిస్తున్నాం. పెట్టుబడి పోగా రైతుకు కొంత లాభం ఉందని అందుకే సాగు చేస్తున్నమన్నారు. దీపావళికి చాలావరకు విక్రయాలు జరుగుతాయి.

– రైతు బిక్షపతి. మాచనపల్లి

మంచి లాభం ఉంది



బంతిపూల తోటలు పెడితే రైతుకు కొంత లాభమే ఉంది. మార్కెట్ లో ధర లేకపోతే కష్టం. ఎకరాకు రూ.50 వేల ఖర్చు వస్తుంది. అదే స్థాయిలో ధర పలికితే రైతుకు ఆర్థికంగా బాగానే ఉంటుంది. మందులు, కూలీలు, ఇతర ఖర్చులు పోగ రైతుకు లాభం ఉంటుంది. దశాబ్ద కాలంగా తాను బంతిపూల తోటను సాగు చేస్తున్నాము. కోతుల భయానికి ఇలాంటి పంటలు బాగా ఉంటాయన్నారు. గజ్వేల్ ప్రాంతంలో కోతులు బాగా ఉన్నాయని ఇతర పంటలు వేస్తే తినేస్తున్నాయన్నారు.

– రైతు వెంకటయ్య. గజ్వేల్

ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వ్యాధులను నయం చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వారి వ్యాధులను నయం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్య అధికారులకు, బస్తీ దవాఖానా ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులకు ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపైన జిల్లా కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వారికి చికిత్స చేయాలని, సలహాలు అందించాలని, మీ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు, వెంటనే స్పందించి ఆరోగ్య సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్లి కారణాలు తెలుసుకొని జిల్లా కార్యాలయానికి నివేదికను పంపాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు, తల్లి బిడ్డల సంరక్షణ చర్యలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, హెచ్‌బీఎన్‌సీ గృహ సందర్శనలో భాగంగా పుట్టిన బిడ్డ యొక్క సంరక్షణ చర్యల గురించి, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించా రు. ఓఆర్ఎస్, ఐవీ ఫ్లూయిడ్స్ అత్యవసర సమయం లో ఉపయోగించే మందు లను అందుబాటులో ఉంచుకోవాలని, ఓపి సంఖ్యను పెంచాలని, గర్భిణీ స్త్రీ నమోదు, పరీక్షలు నిర్వహించాలని, బర్త్ ప్లానింగ్ గురించి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యూపీఎస్సీలు, బస్తి దావఖాన్లు, ఆయుష్ డిస్పెన్సరీలు, హెల్త్ వెల్నెస్సెంటర్స్ జిల్లాలోని డిఆర్‌ఏ సెక్షన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయిం చుకోవాలని తెలిపారు. వైద్య అధికారులు ప్రతి నెల ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపైన సమీక్ష నిర్వహించాలన్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్ , ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శ్రీ కళ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి

- ఎంఎస్‌పీ సీనియర్ నేత లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ



నవతెలంగాణ-గజ్వేల్

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలులోకి తీసుకువచ్చిన తరువాతనే ఉద్యోగాలు భర్తీ చేయలని ఎంఎస్‌పీ సీనియర్ నేత లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముంద్రాతీ కృష్ణ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పేర్క పర్ష రాములు, సీనియర్ నేతలు మల్లిగారి యాదగిరి, మైస రాములు డిమాండ్ చేశారు. శనివారం చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ కేటగిరిలోని టిచర్ పోస్టుల్లో 80శాతం పైగా మాలలకే చెందాయని అన్నారు. తక్షణమే ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలని అన్నారు. కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం సిద్దిపేటలో మాదిగల ధర్మయుద్ధ సదస్సును ఈ నెల 28 న సాయంత్రం 4 గంటలకు వయోల గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని, మంద కృష్ణ మాదిగ పాల్గొంటారని అన్నారు. మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి సింధు, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ శనిగరి రమేష్, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల అధ్యక్షులు ఉబ్బనీ ఆంజనేయులు, నాయకులు చిట్యాల రవీందర్, బుర్కీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పదవిలో లేకున్నా దుబ్బాక అభివృద్దే లక్ష్యం



- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ- రాయపోల్

పదవి ఉన్నా లేకున్నా దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి నా లక్ష్యంగా పనిచేస్తానని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలంలో మొండి చింత నుంచి బేగంపేట వరకు గల రోడ్డు, కొండపోచమ్మ ఉప్పరపల్లి కాల్వ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోడ్డు పూర్తిగా గుంతల మయమై దెబ్బతిన్నదని రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని సదరు కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు త్వరగా ప్రారంభించి సకాలంలో పూర్తిచేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్డు నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. అలాగే కొండపోచమ్మ సాగర్ నుంచి ఉప్పరపల్లి వరకు వెళ్లే కాల్వ పనులను కోనాపూర్ గ్రామంలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. రానున్న నాలుగు నెలల్లో మండల వ్యాప్తంగా నూతన రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పడాల రాములు, నాయకులు బండారు లాలు, స్వామి, ఆది వేణుగోపాల్, మల్లారెడ్డి, పడాల మల్లేశం, సంపత్ రెడ్డి, ఎల్లయ్య, మల్లేశం, చంద్రారెడ్డి, యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- నలుగురు వ్యక్తుల అరెస్టు.



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

పేకాట స్థావరం పై దాడి చేసి పేకాడుతున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోర్నాల గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో రూరల్ పోలీసులతో కలసి వెళ్లి రైడ్ చేయగా ఇద్దరు వ్యక్తులు పారిపోగా, మిగతా నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3,700 నగదుతో పాటు, 5 బైక్‌లు, 4మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు, సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డిలు మాట్లాడుతూ ఎక్కడైనా చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిసినా, సమాచారం ఉన్నా వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-తొగుట



మండలంలోని లింగాపూర్, వెంకట్రావు పేట, జప్తి లింగారెడ్డి పల్లి, తుక్కాపూర్, ఎల్లారెడ్డి పేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యం లో మహిళా సంఘాలతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), మాజీ ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, గంట రేణుకా రవీందర్, రైతులు, హమలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు..

కొనుగోలు కేంద్రం ఏర్పాటు పై రైతులతో డీపీఎం సమీక్ష

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని లింగాపూర్, గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రయివేటు స్థలంలో కాకుండా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్ చేయడంతో గ్రామాన్ని సిద్దిపేట డీపీఎం కరుణాకర్ శనివారం గ్రామాన్ని సందర్శించి మహిళలతో రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ గ్రామంలో వీరరాఘవుల కుంటలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరినట్లు తెలిపారు. మహిళా సంఘాలతో రైతులతో కలిసి వీరరాఘవల కుంటను పరిశీలించినట్లు తెలిపారు. వీరరాఘవుల పంటలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆ స్థలం చదును చేసేందుకు చేసిన ఖర్చులను మహిళా సంఘాలు భరించాలని రైతులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఏపీఎం బాబురావు, సీసీ మహేందర్, మాజీ సర్పంచులు బండి చంద్రయ్య, ముక్క కనకయ్య, చంద్రయ్య, గ్రామస్తులు సిరిమల్ల భాస్కర్, జిల్లా కొండూరి వెంకటేశ్వర్లు, భూపతి, సుందరగిరి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

- దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్



నవతెలంగాణ-రాయపోల్

మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహన దారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రం రామాయంపేట రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. అలాగే గతంలో వాహనాల పై ఉన్న పెండింగ్ చలానలు వాహనదారుల నుంచి వసూలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట ఒరిజినల్ పత్రాలు ఉంచుకోవాలని, లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇలాంటి పత్రాలు లేకుండా వాహనాలను నడపరాదని తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించా లని, కారు వాహనదారులు సీటు బెల్ట్ పెట్టుకోవాలని తెలియ జేశారు. 18 ఏండ్లలోపు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని ఇచ్చినట్లయితే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు కఠిన శిక్షలు వేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలాగే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొవద్దన్నారు. ధ్రువపత్రాలు లేని పలు వాహనాలకు చలానాలు వేయడం జరిగిందన్నారు. అలాగే వాహనదారులు ఎవరైనా సరే ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-మర్కుక్



భార్య కాపురానికి రావడంలేదని మనస్థాపానికి గురై యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన మర్కుక్‌లో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, ఎస్ఐ దామోదర్ వివరాల ప్రకారం మర్కుక్ గ్రామానికి చెందిన నీల సాయి (23) గత రెండేండ్ల క్రితం భవానిని వివాహం చేసుకున్నాడు. వివాహం చేసుకున్నప్పటి నుంచి ఏడాది వరకు బాగానే ఉన్నాడు. ఆ తర్వాత తరచూ మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడని పలు మార్లు ఉరివేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. గత 2 నెలల క్రితం మధ్యం సేవించి వచ్చి ఇంట్లో భార్యతో గొడవపడ్డాడు విషయం తెలుసుకున్న భవాని తల్లి దండ్రులు వచ్చి తన పుట్టింటికి తీసుకుపోయారు. అప్పటి నుంచి కాపురానికి రావడంలేదని మనస్థాపానికి గురై ఇంట్లో దూళానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారికి దుర్వాసన రావడంతో శనివారం మధ్యాహ్నం ఇంటి తలుపులు తెరిచి చూసేసరికి ఉరి వేసుకొని ఉన్నాడు. గత రెండు రోజుల క్రితమే ఉరివేసుకొని ఉండవచ్చని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చిన్న తనంలోనే నాన్న, గత రెండు సంవత్సరాల క్రితం తల్లి అనారోగ్యంతో మరణించింది. అతనికి నా అనే వాళ్ల ఎవరులేకపోవడంతో శవాన్ని పోస్టు మర్టం నిమిత్తం గజ్వేల్ హాస్పత్రికి తరలించారు. మృతుని భార్య భావాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నమని ఎస్ఐ తెలిపారు.

టపాసుల వ్యాపారాలపై సమగ్ర విచారణ జరపాలి

- కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అంజేసిన సీసీఆర్

నవతెలంగాణ-సిద్దిపేట

దీపావళి పండుగను పురస్కరించుని సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న టపాసుల వ్యాపారలపై సమగ్ర విచారణ జారపాలని కోరుతూ కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో సెంట్రల్ ఫర్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీసీఆర్ సంస్థ జిల్లా అధ్యక్షులు గుండ్ల శివ చంద్రం, సెంట్రల్ కమిటీ కార్యదర్శి సాజిద్ మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసే టపాసుల విక్రయ కేంద్రాల్లో అంత అవకతవకలు జరుగుతున్నాయాన్నారు. దాదాపు 7 ప్రభుత్వ శాఖల అనుమతులు అవసరం అయిన వ్యాపారులు జీరో బిజినెస్‌కు తేర లేపారని ఆరోపణలు ఉన్నాయన్నారు. టపాసులు కొనే కన్స్యూమర్‌లకు కనీసం ఒరిజినల్ బిల్లు కూడా ఇవ్వరన్నది బహిరంగ రహస్యమే అన్నారు. ఇక టపాసుల ఎంఆర్‌పీ రేట్లు చూస్తే మతిపోతుందని ఎమ్మార్పి ఎంత నిర్ణయించాలి. ఈ ఏడాది టపాసుల వ్యాపారం పై సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వ ఖాజనకు, అలాగే సామాన్యులా జేబులకు చిల్లు కొడుతున్న వ్యాపారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తు ఆహ్వానం

- దౌల్తాబాద్ ఆదర్శ కళాశాల ప్రధాన ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్



నవతెలంగాణ-రాయపోల్

దౌల్తాబాద్ మండల కేంద్రంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో పీజీటీ భౌతిక శాస్త్రం విభాగంలో తాత్కాలిక ఉపాధ్యాయులుగా గంటల ప్రాతిపదికన ఈ విద్యా సంవత్సరం బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానోపా ధ్యాయులు దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌతిక శస్త్రం విభాగంలో ఎమ్మెస్సీ భౌతిక శాస్త్రం, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అర్హతలు ఉండి ఆసక్తి, ఉత్సాహం గలవారు ఈ నెల 29 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డెమో ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు దుర్గ ప్రసాద్ తెలిపారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

నవతెలంగాణ-రాయపోల్



పేదరికంతో డబ్బులు లేకుండా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ మంగలి యాదగిరి కుటుంబానికి బియ్యం అందజేసి మానవత్వం చాటుకున్నారు. నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు మంగలి స్వామి శనివారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో యాదగిరి కుటుంబాన్ని పరామర్శించి, 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరి ఆటో నడిపితే ఉపాధి లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టమయ్యింది. అనారోగ్యానికి గురైతే కూడా చికిత్స తీసుకోవడానికి డబ్బులు లేకపోవ డంతో మృతి చెందడం చాలా బాధా కరం. యాదగిరి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం నర్సింలు, కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.